# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :28 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: బుధవారం 26-03-2025 | పేజీలు:4 వెల: 2.00


## ముగ్గురు మావోల హతం...

రాయపూర్,మార్చి25: ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులను మృతి చెందారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... యాంటీ మావోయిస్ట్ ఆపరేషన్‌లో భాగంగా భద్రతా దళాలు దంతెవాడ, బిజాపూర్ జిల్లాల సరిహద్దులో ఉన్న అడవిలో ఈరోజు ఉదయం 8 గంటల సమయంలో కాల్పులు జరిపారు. మావోయిస్టులకు, భద్రతా దళాలకు జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. సంఘటనా స్థలం నుంచి ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలతోపాటు- తుపాకులను, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు- పోలీసులు తెలిపారు. ఇంకా ఆపరేషన్ కొనసాగుతుందని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసు అధికారులు తెలిపారు.కాగా, ఈ నెల 20వ తేదీన బీజాపూర్, కాంకేర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 22 మంది మావోయిస్టులు మృతి చెందిన సంగతి తెలిసిందే.

## కమ్రా సుపారి తీసుకున్నట్లుంది.. కమెడియన్ వ్యాఖ్యలపై స్పందించిన ఏక్‌నాథ్ షిండే



ముంబై:మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే పై స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రా చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఆదివారం జరిగిన కామెడీ షోలో కమ్రా మాట్లాడుతూ.. థాణే నుంచి వచ్చిన ఓ నాయకుడు.. బీజేపీతో చేతులు కలిపి శివసేనను చీల్చేశాడని, అతడు దేశద్రోహి అని వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలు మహా రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారంపై ఏక్‌నాథ్ షిండే తొలిసారి స్పందించారు. కమెడియన్ వేసిన సెటైర్ తనకు అర్థమైందని, అయితే దేనికైనా పరిమితి ఉండాలని వ్యాఖ్యానించారు.బీబీసీ మరాఠీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో షిండే మాట్లాడుతూ.. 'ప్రతీ వ్యక్తి ఒక నిర్దిష్ట స్థాయిని కొనసాగించాలి. లేదంటే చర్య ప్రతిచర్యకు కారణమవుతుంది. భారత రాజ్యాంగం ప్రతీ పౌరుడికీ తన అభిప్రాయాలను వెల్లడించే స్వేచ్ఛ (ఫ్రీడమ్ ఆఫ్ స్పీచ్) ఇచ్చింది. కానీ దానికి ఒక పరిమితి ఉంటుంది. నాపై ఇలాంటి సెటైర్లు వేయడానికి కమ్రా సుపారి తీసుకున్నట్లు ఉంది' అని షిండే వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛ ముఖ్యమని.. కానీ వేరే వారి తరఫున ఇతరుల గురించి ఇలా తప్పుగా మాట్లాడటం సరికాదన్నారు.'ఇలాంటి పనులు చేయడానికి ఆయన ఎవరి నుంచి సుపారి తీసుకుంటారు..? ప్రజా స్వామ్యంలో స్వేచ్ఛ ముఖ్యం. కానీ ఒకరి ఆదేశం మేరకు మరొకరి గురించి తప్పుగా మాట్లాడటం ఎంత వరకు సరైంది..? నా గురించి మర్చిపోండి.. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, మాజీ ప్రధాన న్యాయమూర్తి, ఆర్థిక మంత్రి, హోం మంత్రి, పారిశ్రామికవేత్తల గురించి ఏం మాట్లాడారో చూడండి' అని గతంలో కామ్రా చేసిన వ్యాఖ్యలను షిండే ఈ సందర్భంగా ప్రస్తావించారు. అదేవిధంగా జర్నలిస్ట్ అర్నాబ్ గోస్వామితో కునాల్ కమ్రా ఘర్షణను కూడా ఈ సందర్భంగా షిండే గుర్తు చేశారు. జర్నలిస్ట్‌తో గొడవ పడి విమాన ప్రయాణ నిషేధాన్ని కూడా ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. కమ్రాను వాతావరణాన్ని కలుషితం చేసే, శాంతి భద్రతల పరిస్థితిని ప్రభావితం చేసే వ్యక్తిగా అభివర్ణించారు.

### షిండేపై కమెడియన్ కునాల్ వ్యాఖ్యలు

ముంబైలోని ఖార్ ప్రాంతంలోని ది హాబిటాట్ కామెడీ క్లబ్బులో జరిగిన కార్యక్రమంలో కునాల్ కమ్రా దిల్‌తో పాగల్ హై పాటను రాజకీయ పేరడీ చేసి పాడారు. ఇందులో షిండే ను ఉద్దేశించి ద్వంద్వ అర్థం వచ్చేలా పాడారు. ఈ సందర్భంగా షిండేను ఉద్దేశించి దేశద్రోహి అంటూ అభివర్ణించాడు. ఇది షిండే అభిమానులకు కోపం తెప్పించింది. కునాల్‌కు వ్యతిరేకంగా క్లబ్‌పై శివసేన కార్యకర్తలు దాడి చేసి, ధ్వంసం చేశారు. తక్షణమే కునాల్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కునాల్ కమ్రా వ్యాఖ్యలు దుమారం రేగడంతో శివసేన యువసేన ప్రధాన కార్యదర్శి రాహుల్ కనాల్ .. కునాల్ కమ్రా సహా రాహుల్ గాంధీ, ఆదిత్య ఠాక్రేలపై ఫిర్యాదు చేశారు. దీంతో ఈ ముగ్గురిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ముందస్తు ప్రణాళికతోనే షిండేపై అనుచిత వ్యాఖ్యలు చేశారని తెలిపారు. కునాల్ క్షమాపణ చెప్పాలని సీఎం ఫడ్నవీస్ సైతం డిమాండ్ చేశారు.

## సొంత పార్టీ నేతలపై రాజాసింగ్ గరంగరం...



హైదరాబాద్ : సొంతపార్టీ నేతలే తనపై కుట్ర చేస్తున్నారని, తనను జైలుకు పంపించే ప్రయత్నం చేశారని ఆరోపించారు గోషామహల్ ఎమ్మెల్యే, బీజేపీ సీనియర్ నేత రాజాసింగ్ . తనపై పీడీ యాక్ట్ పెట్టాలని పోలీసులకు సూచించారని వెల్లడించారు. బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నప్పటికీ రాజాసింగ్ అసెంబ్లీకి హాజరు కావడంలేదు. దీనిపై పార్టీలో పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి.బీజేపీ తెలంగాణ అధ్యక్షుడి నియామకానికి సంబంధించి పార్టీ అధిష్టానం చర్చలు జరుపుతున్న వేళ రాజాసింగ్ తాజా వ్యాఖ్యలు పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి ఎంపికపైనా రాజాసింగ్ ఇటీవల కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలతో రహస్యంగా సమావేశమయ్యే వారిని కాకుండా, పార్టీ కోసం కష్టించి పనిచేసే నికార్సైన లీడర్ ను రాష్ట్ర అధ్యక్షుడిగా చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ కోసం, కార్యకర్తల కోసం నిరంతరం పనిచేసే లీడర్ ను అధ్యక్షుడిగా చేస్తే రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని ఆయన అన్నారు.

### కేటీఆర్ కు వార్నింగ్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కు బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ వార్నింగ్ ఇచ్చారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రిటైర్ అయిన పోలీసు అధికారులపై కూడా చర్యలు తీసుకుంటామంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై రాజాసింగ్ మండిపడ్డారు. పోలీసులతో పెట్టుకోవద్దని ఆయన వార్నింగ్ ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పుడు ఎంపీగా ఉన్న రేవంత్ రెడ్డిని అరెస్ట్ చేసి జైలుకు పంపించారని గుర్తు చేశారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి సీఎం అయిన తర్వాత కూడాగతంలో ఆయనను అరెస్ట్ చేయించిన వారిని ఏమీ చేయలేదని చెప్పారు. ఎవరు అధికారంలో ఉంటే వారు చెప్పిన విధంగా పోలీసులు లీగల్ గా చేస్తారని రాజాసింగ్ చెప్పారు. బీజేపీ కార్యకర్తలపై ఎన్నో కేసులు పెట్టి జైలుకు పంపించారని తనపై కూడా పీడీ యాక్ట్ పెట్టి జైలుకు పంపించారన్నారు. తనను జైలుకు పంపించే సమయంలో సొంత బీజేపీ పార్టీ నేతలే పోలీసులకు మద్దతుగా నిలిచారని విమర్శించారు. ఇప్పటికీ తమ పార్టీలోని వారే తనకు వెన్నుపోటు పొడవాలనే ఆలోచనలో ఉన్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు.

## ఏప్రిల్‌లో మెగా డిఎస్సీ..మేలో తల్లికి వందనం అమలు



అమరావతి,మార్చి25: ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుభవార్త చెప్పారు. మెగా డీఎస్సీపై ముఖ్యమంత్రి కీలక ప్రకటన చేశారు. మంగళవారం కలెక్టర్ల సదస్సులో సీఎం మాట్లాడుతూ.. డీఎస్సీపై స్పష్టత ఇచ్చారు. ఏప్రిల్ మొదటి వారంలోనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ప్రకటిస్తామని చెప్పారు. ఎస్సీ వర్గీకరణతోనే డీఎస్సీ పోస్టుల భర్తీ ఉంటుందన్నారు. పాఠశాలల ప్రారంభం నాటికి పోస్టింగ్‌లు ఇవ్వాలని నిర్ణయించినట్లు- ముఖ్యమంత్రి వెల్లడించారు. అలాగే మే నెల నుంచి తల్లికి వందనం పథకం అమలు చేస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. సచివాలయంలో రెండు రోజుల పాటు జరగనున్న కలెక్టర్ల సదస్సులో మాట్లాడుతూ.. కలెక్టర్లు జిల్లా ముఖ్య నిర్వహణా అధికారులు అంటూ..ఏసీ రూమ్‌లకు కలెక్టర్లు పరిమితం కావద్దన్నారు.. సమస్యల పరిష్కారంలో కలెక్టర్లది కీలక పాత్ర అని చెప్పుకొచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారమే అందరి లక్ష్యమని వెల్లడించారు. విధ్వంసమైన రాష్ట్రాన్ని అందరం కలిసి గాడిలో పెట్టాలన్నారు. రాష్ట్రాన్ని పునఃనిర్మాణం చేస్తామని హామీ ఇచ్చామని.. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన తమ విధానమని తెలిపారు. కలెక్టర్లు దర్పం ప్రదర్శించడం కాదని.. క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. సంక్షేమ పథకాలు లేకపోతే పేదరిక నిర్మూలన జరగదన్నారు. సంక్షేమం అమలు చేయాలంటే అభివృద్ధి జరగాలని అన్నారు. అప్పులు తెస్తే ఎంతకాలం కొనసాగిస్తామని ప్రశ్నించారు.వైసీపీ ప్రభుత్వ పాలనను ప్రజలు ఆమోదించలేదని.. అందుకే ప్రజలు కూటమికి తిరుగులేని తీర్పు ఇచ్చారన్నారు. ఐదేళ్లకు ఒకసారి ప్రజలు తీర్పు ఇస్తారన్నారు. 9 నెలల్లో అనేక హామీలు అమలు చేస్తూ వస్తున్నామన్నారు. దేశంలో ఎక్కడా రూ.4 వేలు పింఛన్ లేదు.. మనం ఇస్తున్నామన్నారు. దివ్యాంగులకు పింఛన్ రూ.6 వేలకు పెంచామని చెప్పుకొచ్చారు. అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్ట్ అని అన్నారు. ప్రపంచంలోనే బెస్ట్ మోడల్‌తో అమరావతి అభివృద్ధి జరుగుతుందన్నారు. అన్న క్యాంటీన్లతో రూ.5కే భోజనం అందిస్తున్నామని.. దీపం-2 కింద ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామన్నారు. చెత్త పన్నును తొలగించామని తెలిపారు. 2027కు పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని వెల్లడించారు. విజన్ 2047పై ప్రధానంగా కలెక్టర్లు దృష్టి పెట్టాలన్నారు.. పెన్షన్లను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది అన్నారు.. సోలార్ పవర్‌లో భాగంగా 20 లక్షల మందికి సోలార్ పవర్ ఇవ్వడంలో కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. భవిష్యత్ ను ప్లాన్ చేసే పనిలో కలెక్టర్లు ఉండాలని స్పష్టం చేశారు.. ప్రజల్లో అత్యంత ప్రభావం కలిగించే వ్యక్తి కలెక్టర్.. కెరీర్‌లో కలెక్టర్... చీఫ్ సెక్రెటరీకి ఇవే ముఖ్యం అన్నారు.. ఇక, రొటీన్‌గా ఉంటే ఏడాది అవుతుంది.. మరో నాలుగేళ్లు కూడా గడిచిపోతాయి అన్నారు. ఈ ప్రభుత్వం.. సంక్షేమం.. అభివృద్ధి.. సుపరిపాలన... ఈ మూడు గుర్తుండాలి.. ప్రజలు ఆనందంగా ఉండాలంటే సంక్షేమం కావాలి.. పెన్షన్ల విషయంలో ప్రభుత్వం చాలా ఉదారంగా ఉంది.. కేవలం పెన్షన్ల కోసం ఏడాదికి 33 వేల కోట్లు అవుతోందని వెల్లడించారు. అమరావతి అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్.. ప్రజల్ని ప్రోగ్రెస్ లో భాగస్వామ్యం చేయాలన్నారు.. 20 లక్షల మందికి సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు- చేస్తాం.. ఎట్టి పరిస్థితుల్లో కలెక్టర్లు.. సోలార్ రూఫ్ టాప్ పై దృష్టి పెట్టాలన్నారు.. ప్రీ మాన్‌సూన్ పోస్ట్ మాన్‌సూన్ పై దృష్టి సారించాలి.. ప్రతి జిల్లా కలెక్టరు అరకు కాఫీ పై ఫోకస్ చేయాలన్నారు.. మరోవైపు, మే నెలలో తల్లికి వందనం ఇస్తాం.. త్వరలో విధి విధానాలు వస్తాయని తెలిపారు. 26 జిల్లాల కలెక్టర్ల పెర్ఫామెన్స్ పై సమీక్ష జరుగుతుందన్నారు. స్వర్ణాంధ్ర 2047.. వికసిత్ భారత్ పై ప్రధాని నరేంద్ర మోడీ దృష్టి పెట్టారు..

## డీలిమిటేషన్‌పై బహిరంగ వ్యాఖ్యలు సరికాదు



రాజమండ్రి,మార్చి25: నియోజకవర్గాలు పునర్విభజనపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. కేంద్రంతో అంతర్గతంగామాట్లాడుతున్నారని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. ఎన్డీఏలో భాగస్వామ్యంగా ఉన్నాం కాబట్టి ఈ వ్యవహారంపై బహిరంగంగా మాట్లాడకూడదని పేర్కొన్నారు.. జనాభా విషయంలో దక్షిణాది రాష్ట్రాలు ముందు నుంచి చాలా క్రమశిక్షణ పాటించాయి.. ఇప్పుడు జనాభా పేరుతో సీట్లు- తగ్గించడం సరికాదని రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి వ్యాఖ్యానించారు. జగన్ అపర గోబెల్స్ లా మాట్లాడాడు.. మరో మూడేళ్ల తర్వాత అధికారంలోకి వస్తానని జగన్ అంటున్నాడు.. జగన్ వచ్చేది రాజమండ్రి సెంట్రల్ జైలుకే అంటూ చౌదరి సంచలన వ్యాఖ్యలు చేశారు. లిక్కర్, మైనింగ్ కుంభకోణాలు ఒక్కొక్కటి బయటికి వస్తున్నాయి.. జగన్ హయాంలో పంటలకు ఇన్సూరెన్స్ కూడా చెల్లించక రైతులు వేల కోట్ల నష్టపోయారు.. జగన్ హయాంలో గ్రామాల్లో ఒక రోడ్డు కూడా వేయలేదని విమర్శించిన ఆయన.. జగన్ మళ్లీ జైలు ఊచలు లెక్కించాల్సిందే అన్నారు.. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సీఎం సహాయ నిధి నుంచి ప్రజలను ఆదుకుంటున్నాం.. మేలో తల్లికి వందనం, జూన్ లో అన్నదాత సుఖీభవ అమల చేయబోతున్నాం.. రానున్న పుష్కరాలకు రాజమండ్రి చుట్టు-పక్కల ప్రాంతాలు అభివృద్ధి చెందెల ప్రణాళికలు వేస్తున్నామని వెల్లడించారు.. రాజమండ్రిలో 12 ఎకరాల్లో క్రికెట్ స్టేడియం నిర్మాణం జరగబోతుంది. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని చిన్నితో ఇప్పటికే మాట్లాడానని తెలిపారు.. గతంలో వైసీపీ కార్యాలయానికి రాజమండ్రిలో అధికారులు తక్షణమే స్థలం ఇచ్చేశారు.. కానీ, టీ-డీపీ కార్యాలయం కోసం స్థలం అడుగుతుంటే అధికారులు ఇవ్వడం లేదని గోరంట్ల బుచ్చయ్య చౌదరి మండిపడ్డారు.

## దక్షిణాదిలో డీలిమిటేషన్ కాక..హుటాహుటిని ఢిల్లీకి పళనిస్వామి




చెన్నై,మార్చి25: దక్షిణాదిలో డీలిమిటేషన్ వ్యవహారం కాకరేపుతున్న తరుణంలో అన్నాడిఎంకె ప్రధాన కార్యదర్శి, మాజీ సిఎం పళని స్వామి హుటాహుటిన ఢిల్లీకి బయలుదేరారు. ఇప్పటికే తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో కేంద్రంపై పోరాటానికి దిగారు. ఇప్పటికే పార్లమెంట్ ఉభయసభల్లో డీఎంకే సభ్యులు పోరాటం చేస్తున్నారు. ఇటీవల చెన్నై వేదికగా దక్షిణాది రాష్ట్రాల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ, కర్ణాటక, కేరళ, ఒడిశా, పంజాబ్ నుంచి ముఖ్యమంత్రులు, డిప్యూటీ- సీఎంలు హాజరై తమ గళాన్ని తెలియజేశారు. డీలిమిటేషన్‌తో ఏర్పడే విపత్తును గురించి ప్రస్తావించారు. తదుపరి సమావేశాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు- చేయాలని నిర్ణయం తీసుకున్నారు. పెద్ద ఎత్తున భారీ బహిరంగ సభ కూడా ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రచిస్తున్నారు. ఇదిలా ఉంటే డీలిమిటేషన్‌పై ఉద్యమం ఉధృతం అవుతున్న వేళ బీజేపీ అధిష్టానం అప్రమత్తం అయింది. తమిళనాడు అన్నాడీఎంకే ప్రధాని కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి పళినిస్వామికి కబురు పంపింది. దీంతో ఆయన అత్యవసరంగా దేశ రాజధాని ఢిల్లీకి బయల్దేరారు. ఢిల్లీలో బీజేపీ అగ్ర నేతలను కలిసే అవకాశం ఉంది. సాయంత్రం కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిసే ఛాన్సుందని తెలుస్తోంది. అంతేకాకుండా వచ్చే ఏడాదే అసెంబ్లీ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో మరోసారి బీజేపీ-ఏఐడీఎంకే పొత్తు ఉండే అవకాశం ఉందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇక పర్యటనలో భాగంగా ఢిల్లీలో ఏఐడీఎంకే పార్టీ ఆఫీసును ఈపీఎస్ ప్రారంభించనున్నారు.

## పార్టీ ఫిరాయింపులకు ఏడాది పూర్తి.. సుప్రీంకోర్టు కీలక ప్రశ్నలు



న్యూఢిల్లీ,తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హతపై దాఖలైన పిటిషన్‌పై ఇవాళ సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును పరిశీలించింది.విచారణలో జస్టిస్ గవాయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగ ధర్మాసనాల పూర్వపు తీర్పులు ఉన్నప్పటికీ, ఈ వ్యవహారాల్లో ఎప్పటిలోగా తేల్చాలని స్పష్టంగా చెప్పలేదన్నారు. ఉన్నత ధర్మాసనాల తీర్పులను ఎలా తిరిగి రాయగలమని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ధర్మాసనం పలు ప్రశ్నలను సంధించింది. పార్టీ ఫిరాయింపులపై చర్యలు తీసుకోవడానికి ఎంత సమయం ఉండాలి? పదవీకాలం పూర్తయ్యే వరకు వేచిచూడటమే రీజనబుల్ టైమ్ అవుతుందా? మొదటి ఫిర్యాదు నుంచి ఇప్పటి వరకు ఎంత సమయం గడిచిందని జస్టిస్ గవాయ్ ప్రశ్నించారు. న్యాయపరంగా నిర్ణయం తీసుకోవడానికి తగిన గడువు ఉండాలని వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, "పార్టీ ఫిరాయింపులకు వార్షికోత్సవం చేసుకుంటున్నారా?" అంటూ వ్యంగ్యంగా ప్రశ్నించారు.పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు శేషాద్రినాయుడు, ఆర్యమా సుందరం వాదనలు వినిపించారు. తెలంగాణ అసెంబ్లీ నిబంధనల ప్రకారం, అనర్హత పిటిషన్ విచారణార్హతను ముందుగా పరిశీలించాలని, అర్హత లేకుంటే పిటిషన్‌ను డిస్మిస్ చేయాలని వారు వాదించారు. కానీ విచారణార్హత ఉంటే, స్పీకర్ నోటీసులు జారీ చేయాలని, వాటికి వారంలో సమాధానం ఇవ్వాలని నిబంధనలు చెబుతున్నాయని పేర్కొన్నారు. సుందరం తన వాదనలో, రాజ్యాంగంలోని షెడ్యూల్ 10 ప్రకారం న్యాయసమీక్ష అధికారం కోర్టులకు ఉందని గుర్తు చేశారు. ముగ్గురు ఎమ్మెల్యేల అనర్హతపై నోటీసులు ఇచ్చినా, వారు నాలుగు నెలల సమయం కోరారని తెలిపారు. ఇంగ్లాండ్‌లో స్పీకర్ రాజకీయాలకు దూరంగా ఉంటారని, కానీ భారతదేశంలో ఆ పరిస్థితి లేదని న్యాయస్థానానికి వివరించారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ, మనది "వైబ్రెంట్ డెమోక్రసీ" అని వ్యాఖ్యానించింది.సందరం సుభాష్ దేశాయ్ కేసును ఉదహరిస్తూ, ఆ కేసులో కోర్టు నిర్ణీత గడువులోగా స్పీకర్‌ను నిర్ణయం తీసుకోవాలని ఆదేశించిందన్నారు. హైకోర్టు సింగిల్ బెంచ్ తీర్పు తర్వాత షెడ్యూల్ ఖరారు చేయలేదని ధర్మాసనం ప్రశ్నించగా, లేదని ఆయన సమాధానం ఇచ్చారు. ముగ్గురు ఎమ్మెల్యేలపై వేర్వేరుగా ఫిర్యాదు చేసినా, స్పీకర్ స్పందించలేదని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఈ కేసులో కౌంటర్ దాఖలు చేయడానికి మరికొంత సమయం కావాలని కోరిన ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. కేసును ఆలస్యం చేసేందుకు డీలే ట్యాక్టిక్స్ ఉపయోగించవద్దని గట్టిగా హెచ్చరించింది సుప్రీంకోర్టు ధర్మాసనం.

## సునీతా లక్ష్మారెడ్డి పై వ్యాఖ్యలు .. విత్ డ్రా చేసుకున్న స్పీకర్



హైదరాబాద్, తెలంగాణ స్పీకర్ ప్రసాద్‌కుమార్ వ్యాఖ్యలు తనకు బాధ కలిగించాయని నర్సాపురం బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. స్పీకర్ స్థానంలో ఉన్న మీరు అలా మాట్లాడటం బాధకరమన్నారు. తాను ఏం తప్పు చేశానని, మీకు ఎందుకు అలా వినాలనిపించలేదని స్పీకర్‌ను ఆమె ప్రశ్నించారు. విషయంపైనే మాట్లాడాను తప్ప ఎక్కడా పరిధి దాటలేదని గుర్తు చేశారు. అయినా వినబుద్ధికావడం లేదని ఎలా అంటారన్నారు. తనపై వ్యాఖ్యలను స్పీకర్ ఉపసంహరించుకోవాలని కోరారు. శాసనసభలో సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. "సభ్యుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత స్పీకర్‌పైనే ఉంటుంది. నిన్న మీరు అన్నటువంటి మాటలు చాలా బాధాకరం. తాను మాట్లాడుతున్న సందర్భంలో సబ్జెక్టు నుంచి ఎక్కడా డీవియేట్ కాలేదు. మహిళలు, శిశు సంక్షేమం, ఎస్సీ, ఎస్టీ సమస్యలపై మాట్లాడుతానని ముందే సమాచారం ఇచ్చాను. అవకాశం కోసం సాయంత్రం వరకు నిరీక్షించా. రాత్రి 8 గంటలకు మాట్లాడేందుకు అవకాశం కల్పించారు. రెండు నిమిషాల్లో పూర్తిచేయాలని సూచించారు."



తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ గౌరవ శ్రీ నగరి గారి ప్రీతం గారికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ... ఉద్యమ అభినందనలతో.... దళిత సంఘాల జేఏసీ చైర్మన్ గౌరవ శ్రీ ఈదుల పరశురాం మాదిగ మరియు సంఘ పాక ఏసేపు మాదిగ

## సంపాదకీయం

**బుధవారం 26-03-2025**

# ధరలపై నియంత్రణ ఏదీ !

ఓ వైపు రోజురోజుకూ నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. బియ్యం ధరలను నియంత్రించే వారు లేకుండా పోయారు. చౌకబియ్యం మాత్రం 45 ఏళ్ల తరవాత కూడా రూపాయికే లభిస్తున్నాయి. అందుకే తెల్ల రేషన్ కార్డుల కోసం జనం ఎగబడుతున్నారు. తమకు కార్డు రాలేదంటే తమకు రాలేదని దరఖాస్తులు చేస్తున్నారు. దీనికితోడు సన్నబియ్యం ఉగాది నుంచి సరఫరా చేస్తామని ప్రకటించారు. ఇంకేముందు అమ్ముకునే వారికి మరింత ఆదాయం దక్కగలదు. ఇప్పటికే రేషన్ బియ్యం మాఫియా పెద్ద ఎత్తున వ్యాపారం చేస్తున్నా ...ఎక్కడా దాడులు జరడం లేదు. ఇకపోతే నిత్యావసర ధరల్లో క్రమంగా మళ్లీ వంటనూనెల ధరలు పెగుతున్నాయి. ఉల్లిపాయల ధరలు రిటైల్‌లో 30 నుంచి 50 వరకు పలుకుతున్నాయి. శక్కర, పప్పుల ధరలు కూడా సామాన్యలకు అందకుండా పోతున్నాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్వాకం వల్ల ధరలు అదుపు కావడం లేదు. ధరలను అదుపుచేసే వ్యవస్థ తమ చేతుల్లో లేదన్న రీతిలో ప్రభుత్వాలు పాలన కొనసాగిస్తున్నాయి. గృహనిర్మాణ రంగం సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయింది. దీనిని అదుపు చేసేలా స్టీల్, సిమెంట్ ఇతర గృహనిర్మాణ రంగ వస్తువుల ధరలను అదుపు చేయలేకపోతున్నారు. ప్రజలు ఎన్నికల సమయంలో ఈ అంశాలను ఎజెండా చేసుకుని నేతలను నిలదీయాల్సిన అవసరం ఉంది. నేతల మాటల ప్రలోభాలకు, డబ్బులకు లొంగితే వారు మనపై స్వారీ చేస్తారని తేలిపోయింది. అందువల్ల ఉచిత పథకాలకు లొంగరాదన్న జ్ఞానాన్ని పొందడం లేదు. వారిచ్చే డబ్బులకు లొంగడంతో పాలన కూడా తమ ఇష్టానుసారంగా చేసుకుంటున్నారు. ప్రజలు ఏం కోరుకుంటున్నారో వాటిపై చర్చించడం లేదు. చట్టసభల్లో అవి చర్చకు రావడం లేదు. అన్ని పార్టీలు వ్యూహాత్మకంగా తమ ఎజెండా అంశాలపైనే చర్చిస్తున్నాయి. పార్లమెంట్ కావచ్చు, రాష్ట్రాల అసెంబ్లీలు కావచ్చు జరుగుతున్న తంతు ఇదే. ధరల నియంత్రణ ఎవరి చేతుల్లో ఉందో ప్రజలు తమ దగ్గరికి వ్చేనేతలను అడగాలి. ఎందుకు ధరలను నియంత్రించలేక పోతున్నారో ప్రశ్నించాలి. అచ్ఛేదిన్ మాటలకే పరిమతం అయ్యింది. ధరలు తరచూ పెరగడంతో సామాన్య, మధ్య తరగతి కుటుంబాలను ఆందోళన పరుస్తున్నాయి. నిజానికి ధరలు తగ్గించడమెలా..ఖర్చులు తగ్గించుకోవడమెలా అన్నది పాలకులు ఆలోచన చేయడం లేదు. తమ ఖర్చులను పైసా కూడా తగ్గించుకోకుండా విలాసాలకు అలవాటు పడ్డ పాలకులు ఉన్నంతకాలం గ్యాస్, పెట్రో ధరలు పెరుగుతూనే ఉంటాయి. ఏ మాత్రం భవిష్యత్ ఆలోచన లేని పాలకులు ప్రజలకు గుదిబండగా మారారు. ప్రజల నుంచి వసూలుల చేసిన పన్నులతో విలాసాలు చేస్తున్నారు. దర్పంగా కాలం వెళ్లదీస్తున్నారు. ముందుగా పాలకులు పెడుతున్న ఖర్చులపై చర్చ చేయాలి. మనం కడుతున్న పన్నులతో వారు విమానాలు, ఎసి కార్లలో తిరుతూ పాలన చేస్తున్నారు. విదేశాలతో పోలిస్తే మన దేశంలో పాలకుల విలాసాలు చాలా ఎక్కువ. దీనికి ప్రత్యామ్నాయ మార్గాలపై చర్చించాలి. అందుకే వ్యాపారులు ధరలు పెంచడం, పాలకలు చూసీ చూడనట్లుగా ఉండడం ..సామాన్యులపై ఇది మోయ లేని భారంగా మారింది. రోజురోజుకూ నిత్యావసర సరుకులు, వంటనూనెల ధరలు ఆకాశాన్ని అంటుతుండగా.. మరోవైపు పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరల పెరుగుదల పేదప్రజలను బతకలేని స్థితికి చేర్చింది. సామాన్యుల జీవితాలను గమనంలోకి తీసుకోకుండా కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోంది. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కరెంట్ తదితర ఛార్జీలను పెంచి నడ్డి విరుస్తున్నారు. బెంగుళూరు లాంటి నగరాల్లో మంచినీటి కటకటలను ముందే గుర్తించడం లేదు. నీటి సమస్యలు రాకుండా ఓ పదేళ్ల ప్రణాళికలు రచించడం లేదు. పెరుగుతున్న ధరలతో ప్రజల జీవితాలు దుర్భరంగా మారుతున్నాయి. దీనికితోడు జిఎస్టీ పేరుతో చేస్తున్న పన్ను వసూళ్లు కూడా నడ్డి విరుస్తున్నాయి. ఇప్పటికే నిత్యావసర వస్తువులు, నూనె ధరలు భగ్గుమంటుండగా ప్రభుత్వాలు ప్రజా సంక్షేమంను పట్టించుకోకుండా ధరలు పెంచి పెనుభారం మోపడం తగదు. ధరల అదుపునకు చర్యలు తీసుకోవల్సిందే. ప్రభుత్వాలు తమ ఖర్చులను తగ్గించుకోవాలి. పాలకులు తమ ఖర్చులను తగ్గించుకోవాలి. దుబారాను అదుపు చేయాలి. అప్పుడే దేశంలో ధరలను అదుపు చేయగలం అని గుర్తించాలి. దీనిపై ముందుగా ఎన్నికల్లో చర్చించాలి. పాలకుల జల్సా ఖర్చులపై, వారికి ఇస్తున్న టిఎ,డిఎలపై చర్చించాలి. ఆ దమ్ము పాలకులకు,ప్రతిపక్షాలకు ఉందా లేదా అన్నది చర్చించాలి. దేశంలో గత పదేళ్ల కాలం నాటి ధరలను బేరీజు వేసుకుని చర్చ చేయాలి. స్టీల్, సిమెంట్ ధరలు కూడా అదుపు లేకుండా పోయాయి. సామాన్యులకు గృహం అన్నది ప్రభుత్వ దయాదాక్షిణ్యాలపై ఆధారపడ్డ విషయంగా మారింది. మధ్య తరగతి ప్రజలు ఇల్లు కొనుక్కునే పరిస్థితి లేకుండా చేశారు. పెరుగుతున్న నిర్మాణ రంగం వ్యవయంతో పాటు రిజిస్ట్రేషన్, జిఎస్టీ ఛార్జీలు మోత మోగిస్తున్నాయి.

# ‘తెలుగు దేశ’ హిందీ భక్తి: భాషపై ఎందుకీ కార్చిచ్చు?

న్యూఢిల్లీ,ఇంగ్లీష్ ప్రపంచ వాణిజ్య భాష. మనం ఎవరిని ఇష్టపడం, వ్యాపారం ఎలా జరుగుతుంది? జపాన్, చైనా, జర్మనీ, రష్యా, అంతర్జాతీయ మార్కెట్లుగా ఉన్నాయి. అంతర్జాతీయ వాణిజ్యాన్ని ఇవన్నీ ఆంగ్లంలోనే చేస్తున్నాయి. ఇంగ్లీష్ ప్రపంచ వాణిజ్య భాషే కాదు, ప్రపంచ కమ్యూనికేషన్ భాష కూడాని గుర్తుపెట్టుకోవాలి. ఇంగ్లీష్ జ్ఞాన భాష, జ్ఞానానికి మూలం. అయితే, ఇంటర్నేషనల్ మానిటరింగ్ ఫండ్ డాక్యుమెంట్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నాకు తెలుగులో కావాలి. అంతా తెలుగులోనే ఉంటుందా? తెలుగులో సుప్రీంకోర్టు తీర్పు వస్తుందా? సుప్రీంకోర్టు తీర్పులో గూగుల్ ట్రాన్స్‌లేట్‌ను ఎన్ని తెలుగులో వాడుతున్నారు. అసలు తెలుగులో ఇప్పటికి ఎన్ని తీర్పులు వచ్చాయి? వైజ్ఞానిక పరిశోధన, వైద్య పరిశోధన తెలుగులో ఉందా? ప్రపంచానికి ఆంగ్లంలో పరిజ్ఞానం ఉంది, వాస్తవంలో అది ఆధిపత్యం చెలాయిస్తుంది. మన కోరిక సరే కాని అది వాస్తవం.చైనా, జర్మనీ, ఇటలీ వంటి దేశాలలో సొంత భాషనే వాడుకుంటున్నారని తెలియడం లేదా? రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు ఆంగ్ల విద్యను అభ్యసించాలి. పేద పిల్లలకు ఇంగ్లీష్ విద్య దొరకదు. మన తెలుగు మాట్లాడే‘తెలుగు దేశమా’అని చెప్పగలరా? ముఖ్యమంత్రి, టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు అందరూ తెలుగు మీడియం కావాలనీ, తెలుగు సులభంగా నేర్చుకోవచ్చనీ. ఇది కుల భాషా కాదనీ, అందరి తెలుగు భాష అని అంటున్నారు. తెలుగు చదివే వారందికీ వారిదే తెలుగు భాష అవుతుంది. అది అధికార భాష కేవలం ఈ రెండు రాష్ట్రాల్లో ఉండాలి. త్రిభాషా సూత్రం(ఇంగ్లీషు, హిందీ, ప్రాంతీయ భాషలు)అనీ మనమే అంటున్నాం. మరి “జాతీయ భాష” అనేమాట ఎక్కడునుంచి వచ్చింది?

ఆర్టికిల్ 343 కీలకం

ఆర్టికల్ 343 కింద రాజ్యాంగ పరిషత్తు చర్చలలో ఈ ప్రశ్న ప్రస్తావన వివరంగా వచ్చింది. బ్రిటిష్ ఇండియాలో విదేశమన్నా, స్వదేశమన్నా జాతీయ అన్నా అంతర్జాతీయం అన్నా అది 1947 ముందు నుంచి ఇప్పుడిదాకా ఇంగ్లీష్ వాడుకుంటున్నాం. తెలియకపోయినా ముక్కలు ముక్కలుగానైనా వాడుతున్నాం. హిందీతో సహా సమానంగా అన్ని భాషలను కాపాడుకోవాలనే ఆలోచనే వీరికి లేదు. పైగా శాసనసభలో ఉపన్యాసాలు దంచుతున్నారు. బ్రిటిష్ వారు విదేశీ భాష నుంచి భారతదేశానికి స్వాతంత్ర్యం ఇచ్చిన తరువాత కూడా ఆంగ్లం అధికార భాషగా అవతరించింది. అనేకానేక రాష్ట్రాలలో ఇంగ్లీషు అధికార భాషగా ఉంది మరి ప్రజలు వాడుకునేదేమిటి? అది జాతీయ భాష అనేమాట ఎక్కడ నుంచి ఉంది? ఎంత అన్యాయం.

రాజ్యాంగ పరిషత్తులో చర్చ

భారత రాజ్యాంగ పరిషత్తు సభ్యులుగా ఉన్న రాజనీతి వేత్తలు, నేతలు వారి ప్రతినిధులు హిందీ అనేది భారతదేశానికి “చెందిన భాష” మాత్రమేనని స్పష్టం చేశారు. కోట్లాది మందిలో ఇది హిందీయేతర రాష్ట్రమని రాజ్యాంగ రచయితలో ప్రముఖులైన గోవిందాస్ అన్నారు. హిందీ దేవనాగరి, ద్రావిడ భాషల నుంచి వస్తుంది. తెలుగు, తమిళం, మలయాళం కన్నడ లిపి పూర్తిగా భిన్నమైన ద్రావిడ భాషలో ఉన్నాయి. ఈ రెండు భాషలు హిందీ, దేవనాగరి లిపిలో ఉన్నాయి. దక్షిణ భారతదేశం నుంచి హిందీయేతర రాష్ట్రాల వరకు రాజ్యాంగ పరిషత్తులో తీవ్ర చర్చ జరిగింది. తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ కీలకమైన అంశాలు చెప్పారు. జాతీయ భాష అంటే దేశంలోని ప్రతి ప్రాంతంలో భాష వాడుకునే శక్తి ఉండాలని అన్నారు. అందరికీ అందుబాటులో ఉన్నా, కొందరికి మాత్రమే తెలిస్తే అది జాతీయ భాష అవుతుందా? అది కేవలం అధికార భాష అవుతుందని రాజ్యాంగ పరిషత్ తొలి అధ్యక్షుడు డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ వివరించారు. అందరు ఒప్పుకుంటే, మెజారిటీ ఉంటే అది జాతీయ భాష అయ్యే అవకాశం ఉంటుంది. చట్ట బద్ధత వస్తుందని రాజేంద్ర ప్రసాద్ అన్నారు.

నిబంధనలు చర్చ

భారత రాజ్యాంగంలో అధికారిక భాషకు సంబంధించినవి XVII భాగంలో చాలా ఉన్నాయి. XVII భాగంలో మరో నాలుగు అధ్యాయాలు, తొమ్మిది ఆర్టికల్స్ ఉన్నాయి. ఈ ఆర్టికిల్స్‌లో ‘అధికారిక భాష’ (ఆర్టికల్స్ 343, 344)బీ ‘ప్రాంతీయ భాషలు’ (ఆర్టికల్స్ 345–347) అని రెండు భాగాలు ఉన్నాయి. వాస్తవానికి రాష్ట్రాల అధికార భాషలకు ప్రాంతీయ భాషలని పేర్కొంటున్నాయి. సుప్రీంకోర్టు, హైకోర్టుల భాష, చట్టాలు (ఆర్టికల్ 348) చేయడానికి వాడే భాష అని విడిగా ఉందనుకోవలసిందే. నిజానికి చట్టాల భాష అని జనం భాష అని వేరే వేరే ఉంటే ఇంకా కష్టం అవుతుంది.



‘జాతీయ భాష’ కాదు

రాజ్యాంగం XVII భాగంలో అధికారిక భాషకు నిబంధనలు ముఖ్యమైనవే ఉన్నాయి. పార్లమెంటు రాష్ట్ర శాసనసభలు (భాగం , అధ్యాయం XVII ) గురించి చెప్పే అధ్యాయాల్లో, శాసనసభా ప్రక్రియల భాషకు సంబంధించి, ఆర్టికల్స్ 120, 210లు నిబంధనలు వివరిస్తున్నాయి. XVII భాగంలోని ప్రాథమిక హక్కుల విభాగంలోని ఆర్టికల్స్ 29, 30 సంస్కృతిక విద్యా హక్కులను గురించి పేర్కొన్నాయి. భాషాపరమైన తక్కువమందున్న మైనారిటీల హక్కులకు గ్యారంటీ ఇస్తున్నాయి. ఎనిమిదవ షెడ్యూల్ కొన్ని భారతీయ భాషలకు ‘అధికారిక’ హోదాను కల్పించింది.

ఒకే భాషలో మైనారిటీ సమస్య: ఆర్టికిల్ 3

“ద ఆక్స్ ఫర్డ్ హ్యాండ్ బుక్ ఆఫ్ ద ఇండియన కాన్స్టిట్యూషన్” అనే ఉద్గ్రంధాన్నిఎడిట్ చేసిన ముగ్గురు ప్రముఖులలో ఒక రచయిత సుజిత్ చౌదరీ రాజ్యాంగంలో భాషకు సంబంధించిన వివరమైన వ్యాసం రాశారు. అందులో భాష కోసం మనం ప్రత్యేకంగా అనకపోయినా ఆర్టికిల్ 3 వంటి నిబంధనలో కూడా ప్రస్తావన ఉంది. ఉదాహరణకు తెలంగాణ ఆంధ్రప్రదేశ్ విభజన. ఆర్టికల్ 3, ఇది పార్లమెంటుకు రాష్ట్రాల భౌగోళిక పరిమితులను మార్చడానికి కొత్త రాష్ట్రాలను సృష్టించడానికి అధికారాన్ని ఇస్తుంది. ఇక్కడ భాషాపరమైన మైనారిటీల హక్కులు ఉపయోగపడింది తెలంగాణా, ప్రత్యేక ఆంధ్ర ఉద్యమాల విషయంలో రాజ్యాంగమైన, న్యాయమైన అంశాలు ఉన్నాయి.హిందీని ప్రభుత్వ అధికార భాషగా స్వీకరించాలంటే వ్యతిరేకత చాలా కాలం నుంచి ఉంది, ఇది అందరికీ తెలుసు. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం మనది. విస్తృత వైవిధ్యాన్ని కలిగిన ప్రపంచంలో భారతదేశ సమగ్రతను కాపాడేందుకు అనేక భాషలను అధికారిక భాషలుగా ప్రకటించారు. దానికి అనేక అనుభవాలు, సామాజిక, ప్రాంతీయ, రాజకీయ అనుభవాలు నేపథ్యంగా ఉన్నాయి. హిందీ మాట్లాడని రాష్ట్రాల ప్రజలు హిందీకి ప్రాధాన్యత ఇచ్చి ప్రాంతీయ భాషలకు అధికారిక హోదా కల్పించడం అవసరం అనుకున్నారు. అది నిజమే కూడా. ఆర్థిక, రాజకీయ అధికారాన్ని హిందీ మాట్లాడేవారి వైపు బలవంతరంగా మళ్లించేవిధంగా విధానాలు అమలు చేయకూడదని అన్నారు. కాబట్టి కేంద్రంలో ఇంగ్లీష్‌ను ఉపయోగించే కొనసాగించేందుకు, ప్రాంతీయ భాషలకు అధికారిక హోదాను కల్పించేందుకు పోరాడారు. అదే ఇప్పటికీ పనిచేస్తుంది. దాని అవసరం ఇంకా కొనసాగుతూనే ఉంటుంది.”భారతదేశ భాషా రాజకీయాలలో భాషా స్థితి మార్పుల వెనుక ఉన్న ముఖ్యమైన అంశాలు పరిగణించాలి. అంతేకాకుండా భౌతిక వనరుల పట్ల పోటీ గురించి కూడా ఆలోచించాలి. అధికారిక భాషపై చర్చలు కేవలం సాంస్కృతిక విభేదాలను మాత్రమే కాదు, ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశాల కోసం జరిగే పోటీని కూడా చూడాలి. కాబట్టి అందులో సమస్యలు తీవ్రంగా ఉంటాయి” సుజిత్ చౌదరీ అన్నారు.భారత రాజ్యాంగంలోని భాషా నిబంధనలు రాజ్యాంగ రూపకల్పన దాని అమలుకు సంబంధించి అనుభవాలు చెప్పే పాఠాలు ఏంటంటే, అధికారిక భాషను అన్ని ప్రభుత్వ కార్యకలాపాల్లో తప్పనిసరిగా ఉపయోగించి తీరాలనే అభిప్రాయాన్ని భారత రాజ్యాంగం ఒప్పుకోలేదు. స్పష్టంగా తిరస్కరిస్తుంది. దీనిలో అధికారిక భాష ఎంపికను వాడుకోవాలి, స్థానిక స్థాయిలో భాషను ఏవిధంగా ఉపయోగించాలి. ప్రత్యేకమైన విధానాలు సాధనాలు ఉపయోగించడం సాధ్యమా అని ఆలోచించాలి. కాబట్టి మొత్తం దేశానికి ఒకే భాష సాధ్యం కాదు. మరికొన్ని అధికార భాషాలు చేర్చడం ‘మన రాజ్యాంగ రాజీ’సాధించడానికి సాధనంగా మారుతుంది.రాజ్యాంగంలో భాగంలోని ప్రత్యేక నిబంధనలు రాజ్యాంగ రాజీని సాధించడానికి వివిధ వ్యూహాలను ఉపయోగించాయి(ఆర్టికల్ 343, ఆర్టికల్ 344, ఆర్టికల్ 345, ఆర్టికల్ 3 పరిశీలించండి). అధికారిక భాష రాజకీయాలకు ప్రాముఖ్యమైన వేదికలు

# గతి తప్పిన మీడియా!




హైదరాబాద్,తెలంగాణ అసెంబ్లీకి 2023 డిసెంబర్‌లో ఎన్నికలు జరగడానికి కొన్ని రోజుల ముందు ఒక చానెల్ నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ కోదండరాం, నేనూ కలసి ఇంటర్వ్యూ చేసిన కార్యక్రమం ప్రసారం చేసింది. రేవంత్ రెడ్డి నోటినుంచి మాటలు దూకుడుగా వస్తున్నాయనీ, ప్రశాంతంగా మాట్లాడితే బాగుంటుందనీ సూచించాను. తక్కిన ప్యానలిస్టులు కూడా ఏకీభవించారు. ‘ఎదుటివాళ్ళు ఫుట్ బాల్ ఆట కాలితో ఆడుతుంటే నన్ను చేతితో ఆడమంటున్నారు. ఎట్లా సాధ్యం?’ అని రేవంత్ రెడ్డి ఎదురు ప్రశ్నించారు. ఎన్నికలు అయిన తర్వాత మాజీ మంత్రి హరీశ్ రావును కలిసినప్పుడు ‘మీరు ముఖ్యమంత్రిని రేవంత్ రెడ్డిగారు అనండి. దానివల్ల మీకే మంచి పేరు వస్తుంది’ అని సలహా చెప్పాను. ఇద్దరూ నా సలహా పాటించలేదు. ఎవరి కారణాలు వారికి ఉండవచ్చు. దరిమిలా రాజకీయాలలో సంభాషణ నానాటికీ తీసికట్టు అన్న విధంగా ఎంత దిగజారిందో అందరం గమనిస్తూ, బాధపడుతూనే ఉన్నాం.ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్టసభలూ (లెజిస్లేచర్), అధికార యంత్రాంగం (ఎగ్జిక్యుటీవ్), న్యాయస్థానాలూ (జుడీషియరీ) మూడు స్తంభాలు. ఆ మూడూ బీటలువారి బలహీనపడకుండా ప్రజాస్వామ్య సౌధాన్ని నిటారుగా నిలిచి ఉండేలా చూసే బాధ్యత నాలుగో స్తంభమైన మీడియాది. అందుకే దాన్ని పోర్త్ ఎస్టేట్ అన్నారు. ‘గోదీ మీడియా’గా మారి ప్రధాన స్రవంతికి చెందిన పత్రికలూ, టీవీ చానళ్ళూ అధికారంలో ఉన్నవారి ఒడిలో కూర్చొని వారి భజన చేస్తుంటే సోషల్ మీడియా ప్రాముఖ్యం పెరిగింది.మా తరం కంటే ముందు తరంవారికి 1955లో ఆంధ్ర అసెంబ్లీ ఎన్నికలు జరినప్పుడు కమ్యూనిస్టు పార్టీనీ, బసవపున్నయ్య వంటి నాయకులనూ ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రికల సంపాదకులు నార్ల వెంకటేశ్వరరావు, పండితారాధ్యుల నాగేశ్వరరావు చీల్చిచెండాడిన ఉదంతం గుర్తు ఉండే ఉంటుంది. నార్లవారు కాంపెయిన్ జర్నలిజానికి ఆద్యుడు. ఆ ఎన్నికలలో గెలుస్తారని అనుకున్న కమ్యూనిస్టులు ఓడిపోవడానికి ఈ సంపాదకులు కొంతవరకు కారణం. అదంతా ఎన్నికల వరకే పరిమితం. వారిద్దరూ తెలుగు పత్రికా వ్యవస్థలో వరిష్ఠ సంపాదకులుగా పేరుప్రతిష్ఠలు కలిగినవారు. 1969లో తొలి ప్రత్యేక తెలంగాణ ఉద్యమ నాయకుడు డాక్టర్ మర్రి చెన్నారెడ్డి నాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డిని ‘బిడ్డా బ్రహ్మానంద రెడ్డీ’ అని సంబోధించేవారు. ముఖ్యమంత్రి సతీమణి రాఘవమ్మనూ అసభ్యంగా దూషిస్తూ గోడల మీద రాతలు వెలిశాయి. తర్వాత ఉద్యమ నాయకులే అటువంటి రాతలను వ్యతిరేకించడంతో అవి ఆగిపోయాయి. ప్రత్యేక తెలంగాణ మలి ఉద్యమ నాయకుడూ, తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ మాట కటువుగా ఉండేది కానీ రాజకీయాలతో సంబంధంలేని కుటుంబ సభ్యులపైన నిందారోపణలు ఉండేవి కాదు. ఇప్పుడు అన్ని మర్యాదలూ మంటగలిశాయి. ఎన్నికల తర్వాత సైతం వ్యక్తిగత ద్వేషాలతో హద్దులు మీరి చెలరేగిపోతున్నారు. ఈ వాతావరణాన్ని చూసి భరించలేక సుప్రీకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి, ఎమెస్కో ప్రచురణ సంస్థ యజమాని విజయకుమార్, నేనూ చొరవ తీసుకొని కొన్ని మాసాల కిందట హైదరాబాద్‌లో ఒక సమావేశం నిర్వహించాం. నిగ్రహం, నైతికత పాటించవలసిందిగా మీడియా పెద్దలకూ, రాజకీయ నాయకులకూ విజ్ఞప్తి చేశాం. అదే రకమైన సమావేశాన్ని విజయవాడలో నిర్వహించాం.కొన్ని పార్టీలకి సొంత పత్రికలూ, చానళ్ళూ, వెబ్ సైట్లూ ఉన్నాయి. మరికొన్ని పార్టీల అధినాయకుల ఎజెండా, కొందరు పత్రికాధిపతుల ఎజెండా ఒక్కటే కావడం వల్ల దాని ప్రభావం కొట్టవచ్చినట్టు కనిపిస్తున్నది. అన్ని పార్టీలూ శక్తికొలది సోషల్ మీడియా వ్యవస్థలను పోషిస్తున్నాయి. ప్రత్యర్థి పార్టీ కార్యక్రమాలపైన దృష్టిపెట్టడం, ఆ పార్టీని ఎండగట్టడం, దుష్ప్రచారం చేయడం, అప్రతిష్ఠపాలు చేయడం వాటి పని. సోషల్ మీడియాలో పని చేస్తున్న కొందరు వ్యక్తులు రాజకీయ నాయకుల మెప్పుకోసం వారిని ఆకాశానికి ఎత్తుతూ, వారి ప్రత్యర్థులను నేలబారుగా చూపుతున్నారు. ఈ క్రమంలో మహిళలను సైతం ఉపేక్షించడం లేదు. ఇటువంటివారు జర్నలిస్టులుగా చెలామణి అవుతున్నారని ముఖ్యమంత్రి ఆరోపణ. ఎవరు నికార్సయిన జర్నలిస్టో, ఎవరు కాదో నిగ్గుతేల్చాలని మీడియా యజమానులకు ఆయన విజ్ఞప్తి చేశారు. రాజకీయ, మీడియా రంగాలలో బాధ్యులంతా చర్చించుకొని లక్ష్మణరేఖను కొత్తగా నిర్వచించుకొని నియంత్రణ పాటించకపోతే రాష్ట్ర ప్రతిష్ఠ మరింత దిగజారుతుంది.

# క్షయ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యం...

విజయవాడ,క్షయ వ్యాధి రోగులను గుర్తించి చికిత్సతో పాటు పౌష్టికాహారాన్ని అందిస్తున్నామని వ్యాధి నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించి వ్యాధిని నివారించడం ద్వారా క్షయ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి డా.జె.ఉషారాణి తెలిపారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాత ప్రభుత్వ ఆసుపత్రి వద్ద జిల్లా క్షయ వ్యాధి నివారణ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అవగాహన ర్యాలీని జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి డా.జె. ఉషారాణి, డియం అండ్ హెచ్‌వో డా.యం. సుహాసిని, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.ఎ.వెంకటేశ్వరావులు ప్రారంభించారు. ఈ సందర్భంగా డా. జె. ఉషారాణి మట్లాడుతూ క్షయ వ్యాధి నివారణ పట్ల ప్రజలలో అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 10 చికిత్స కేంద్రాల ద్వారా 70 వేల 947 మందికి వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. గత ఏడాది 6,404 క్షయవ్యాధిగ్రస్తులకు, ఈఏడాది ఇప్పటివరకు 1,324 మంది రోగులకు చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. నిక్షయ్ పోషన్ యోజన పథకం ద్వారా వ్యాధిగ్రస్తులకు ప్రతి నెల రూ.500లతో పాటు పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. రోగులకు అందించే 500 రూపాయలను మొత్తాన్ని ఈ నెల నుండి ప్రభుత్వం 1000 రూపాయలకు పెంచడం జరిగిందన్నారు. క్షయ వ్యాధి సోకిన వారితో పాటు వారి కుటుంబ సభ్యులకు కూడా ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ గారి ఆధ్వర్యంలో 48 నిక్షయ్ మిత్రలను ఏర్పాటు చేసి 2,411 మంది రోగులకు ప్రతి నెల పౌష్టికాహార కిట్లను పంపిణీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. గత ఏడాది జిల్లాలో క్షయ వ్యాధిగ్రస్తులు లేని గ్రామాలుగా నందిగామ మండలం తొర్రగుడిపాడు, వత్సవాయి మండలం ఇందుగపల్లి, జి కొండూరు మండలం చిన నందిగామ, చంద్రలపాడు మండలం ఏటూరు గ్రామాలను గుర్తించడం జరిగిందని ఈ ఏడాది ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు, నందిగామ మండలం పల్లగిరి గ్రామ పంచాయతీలు ఎంపిక అయ్యాయని ఆయా గ్రామాలకు జిల్లా కలెక్టర్ ద్వారా టిబి ముక్తి పంచాయతీ ప్రసంశా పత్రాలను అందజేస్తున్నట్లు డా. ఉషారాణి తెలిపారు.జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డా. యం. సుహాసిని మట్లాడుతూ వైద్య అధికారులు, సిబ్బంది జిల్లాలో ప్రతి గ్రామంలో పర్యటించి క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి మెరుగైన చికిత్సను అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రక్తపోటు, మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాదపడేవారు, హెచ్ఐవి వ్యాధిగ్రస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టి టిబి లక్షణాలను ఉన్నవారికి పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. ప్రైవేట్ ఆసుపత్రిలలో నిర్వహించే వైద్య పరీక్షలలో క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తిస్తే సంబంధిత రోగుల సమాచారాన్ని తప్పనిసరిగా జిల్లా క్షయ నివారణ అధికారిని దృష్టికి తీసుకువచ్చేలా చర్యలు తీసుకున్నామన్నారు. క్షయ సమూలంగా నివారించేందుకు స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. క్షయ వ్యాధి రోగులకు సరైన పౌష్టికాహారం లభించక వ్యాధి నుండి ఉపసమనం పొందలేకపోతున్నారన్నారు. దాతలు ముందుకు వచ్చి రోగులకు ఆరు నెలలపాటు పౌష్టికాహారాన్ని అందించగలిగితే ప్రభుత్వం అందించే మందుల ద్వారా వ్యాధిని పూర్తిగా నివారించగలుగుతామన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, డా. రమేష్ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు క్షయ వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రదర్శించిన కళా రూపాలు, రంగవల్లులు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అవగాహన ర్యాలీలో జిల్లా మలేరియా అధికారి డా. మోతిబాబు, జిల్లా ఇమ్మ్యూనైజేషన్ అధికారి డా. శరత్, ప్రభుత్వ ఆసుపత్రి పల్మనాలజీ డిపార్టమెంట్ హెచ్‌వోడి డా. సుధీనా, డా. శిరీష, డిప్యూటీ ఆర్‌యంవో డా.శోభారాణి, క్షయ వ్యాధి నివారణ అధికారులు, సిబ్బంది, నర్సింగ్ కళాశాల విద్యార్థిని విద్యార్థులు, పాత ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కొత్త వారసుడు...

బీహార్ : నితీష్ కుమార్ బీహార్ సీఎం. ఆయన రాజకీయంగా నిబద్ధత కలిగిన నాయకుడు. డాక్టర్ రామ్ మనోహర్ లోహియా జయప్రకాష్ నారాయణ్ వంటి వారి స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చిన ఆయన 1970 దశకం మధ్య నుంచి చురుకైన పాత్ర పోషిస్తూ వస్తున్నారు. 1985లో తొలిసారి బీహార్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన ఆ తరువాత ఎంపీగా ఎమ్మెల్యేగా ఎమ్మెల్సీగా కూడా గెలుస్తూ వచ్చారు.ఆయన రాజకీయ జీవితం సుదీర్ఘమైనది. ఒకనాడు బీహార్ కి సీఎం కావాలని కలలు కన్నారు నితీష్. మొదటిసారి సీఎం అయితే రోజుల వ్యవధిలోనే ప్రభుత్వం పడిపోయింది. కానీ ఆ తరువాత అంటే 2005 నుంచి ఈ రోజు దాకా మధ్యలో కొద్ది నెలలు తపించి నితీష్ కుమార్ బీహార్ ని నిరాటంకంగా ఏలుతున్నారు. ఆయన బీహార్ ని ఇన్నేళ్ళు పాలించిన నేతగా రికార్డుకు ఎక్కారు.అంతే కాదు మంచి పాలనను కూడా అందించారన్న పేరు సంపాదించారు. ఇక నితీష్ కుమార్ కి ఒక్కరే కుమారుడు. పేరు నిశాంత్ కుమార్. ఆయన సాఫ్ట్ వేర్ ఇంజనీర్. రాజకీయాలకు బహు దూరం. నాకు రాజకీయాల పట్ల ఆసక్తి లేదు అని చెప్పే నిశాంత్ ఇపుడు బీహార్ తెర మీద కనిపిస్తున్నారు. అంతే కాదు ఆయన నరేంద్ర మోడీ పాలన బాగుందని అంటున్నారు.ఈ ఏడాది అక్టోబర్ నవంబర్ నెలలలో బీహార్ లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి ఇప్పటి నుంచే రంగం సిద్ధం చేసుకుంటున్నారు అని అంటున్నారు. జేడీయూకి అధినేత నితీష్ కుమార్. ఆయన తరువాత వారసుడిగా నిశాంత్ ఎస్టాబ్లిష్ కావాలని కోరుకుంటున్నారు.అయితే ఇప్పటికే బాగా ఆలస్యం అయింది అని అంతా అంటున్నారు. లాలూ కుమారుడు తేజస్వి యాదవ్ మాదిరిగా అదే విధంగా రామ్ విలాస్ పాశ్వాన్ కుమారుడు చిరాగ్ పాశ్వాన్ మాదిరిగా నిశాంత్ కుమార్ తండ్రి నుంచి నేరుగా రాజకీయాలను అందుకోలేదు రాజకీయాల వైపు చూడలేదు. ఇపుడు ఆల్ ఆఫ్ సడెన్ గా వస్తే ఆయనకు ఎంత వరకూ ఆదరణ ఉంటుంది అన్నది చర్చగా ఉంది.మరో వైపు చూస్తే నితీష్ కుమార్ సైతం వారసత్వ రాజకీయాలను ఎక్కడా ప్రోత్సహించలేదు. తనతోనే అంతా అనుకున్నారు. కానీ నితీష్ ఇపుడు ఆరోగ్యపరంగా కొంత ఇబ్బంది పడుతున్నారని అంటున్నారు. దాంతోనే నిశాంత్ రంగ ప్రవేశం చేయవలసి వచ్చింది అని అంటున్నారు.బీహార్ రాజకీయాల్లో బీజేపీ తమ ముఖ్యమంత్రిని చూడాలని అనుకుంటోంది. అదే విధంగా జేడీయూలో కూడా సీనియర్ నేతలు కొందరు నితీష్ ప్లేస్ లోకి రావాలని చూస్తున్నారు. ఈ విధమైన పరిస్థితుల నేపథ్యంలో నిశాంత్ కనుక రాజకీయాల్లోకి సీరియస్ గా వస్తే తండ్రి లెగసీని కొనసాగించగలరా అన్నది చర్చగా ఉంది. ఆయన దాదాపుగా యాభై ఏళ్ళ వయసులో ఉన్నారు.ఈ ఏజ్ లో రాజకీయంగా ఒక స్థిరమైన పదవిలో ఉంటూ కొనసాగాల్సి ఉంది. ఇంకా ఓనమాలు మొదలెడితే బీహార్ లాంటి గట్టి పోటీ ఉన్న చోట నిషాంత్ ఎంత మేరకు నెగ్గుకుని రాగలరు అన్నది చర్చగా ఉంది. అయితే బీజేపీ నితీష్ రాజకీయ ముద్రని కొనసాగించేందుకు నిశాంత్ ని ప్రోత్సహించినా ఆయనను ఎమ్మెల్యేగా లేక మంత్రి వరకూ తీసుకుని రావచ్చేమో కానీ సీఎం పదవి అయితే దక్కదని అంటున్నారు.అదే విధంగా పార్టీని నడపడం కీలక పదవులు చేపట్టి జనాలకు చేరువ కావడం అన్నది బిగ్ టాస్క్ అని అంటున్నారు. ఇక నిశాంత్ రాజకీయ ఆగమమం మీద బీహార్ రాజకీయ పార్టీలు భిన్నంగా స్పందిస్తున్నాయి.

# వడగళ్లతో ఉత్తర తెలంగాణ అతలాకుతలం

నిజామాబాద్, వడగళ్లతో నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో భారీగా నష్టం జరిగినట్లు తెలుస్తోంది. పలుచోట్ల వరి, మక్క పంటలు దెబ్బతినగా చేతికొచ్చిన మామిడి పంటలు దెబ్బ తిన్నాయి. అధికారుల ప్రాథమిక అంచనాల మేరకు 13 జిల్లాల్లో 11వేల ఎకరాల్లో పంటనష్టం జరిగినట్లుగా వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు నిర్ధారణకు వచ్చారు. మరో రెండు మూడు రోజుల పాటు పంట నష్టం సర్వే పనులు కొనసాగించనున్నారు. అకాల వర్షాలతో జరిగిన పంట నష్టంపై గ్రామాల వారీగా సమగ్రంగా సర్వే చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఇప్పటికే ఆదేశించారు. రైతుకు నష్టం జరిగిన నివేదికలో సమగ్రంగా పొందుపరచాలని సూచించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పంట నష్టం వాటిల్లినట్లు చెబుతున్నారు. ఈ జిల్లాలో 519 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోని కొన్ని మండలాల్లో పంట నష్ట తీవ్రత ఎక్కువగా ఉంది. నిజామాబాద్ జిల్లాలో బోధన్, రూరల్ నియోజకవర్గాల్లో వడగండ్లు, ఈదురుగాలులతో పంటలకు నష్టం జరిగింది. బలమైన గాలులకు ధాన్యం గింజలు నేలరాలాయి. నిస్సిమెట్టి వరకు సాగునీటి కష్టాలను తట్టుకుని పంటలను కాపాడుకున్న రైతుల ఆశలపై ఆకాల వర్షం దెబ్బతీసింది. అకాల వర్షం ఊహించని రీతిలో దెబ్బ కొట్టింది. బోధన్, కోటగిరి, పోతంగల్, నిజామాబాద్ రూరల్, సిరికొండ, ధర్పల్లి, ఇందల్వాయి మండలాల్లో పంట నష్టం సంభవించింది. కామారెడ్డి జిల్లాలో 25 ఎకరాల్లో మక్క దెబ్బతిన్నట్లు గుర్తించారు. గాంధారి మండలం రాంలక్ష్మన్పల్లి, మాత్సంగం, భిక్కనూరు మండలం అంతంపల్లి, రామేశ్వరపల్లి శివారు, సదాశివనగర్ మండలం, అడ్లూర్ ఎల్లారెడ్డి శివార్లలో మక్క పంట నెలకొరిగింది. దోమకొండ, భిక్కనూరు, కామారెడ్డి, సదాశివనగర్, గాంధారి మండలాల్లో కొద్ది పాటి వర్షం పడగా, రాజంపేటలో వడగండ్లు పడ్డాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 350 ఎకరాల్లో పంటనష్టంతో రైతులు ఆర్థికంగా దెబ్బతిన్నారు. ఆసిఫాబాద్ జిల్లాలో 598 ఎకరాల్లో జరిగిన నష్టం వల్ల 279 మంది రైతులకు నష్టం వాటిల్లినట్లు వెల్లడించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని దాదాపు 336 ఎకరాల్లో జరిగిన పంట నష్టం వాటిల్లినట్లు చెబుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో సంగారెడ్డి జిల్లాలో ఎక్కువ నష్టం వాటిల్లినట్లు- అధికారులు తెలిపారు. జిల్లాలో దాదాపు 135 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, 78 ఎకరాల్లో జొన్న, 28.2 ఎకరాల్లో మామిడి, 18 ఎకరాల మొక్కజొన్న దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు. వికారాబాద్ జిల్లాలో జరిగిన పంటనష్టం వివరాలపై అధికారులు సర్వే కొనసాగిస్తున్నారు.

# ఎస్సారెస్పీ స్థిరీకరణతో పంటలకు భరోసా

నిజామాబాద్,శ్రీరాంసాగర్ స్థిరీకరణతో రైతులకు మేలు జరుగనుందని మాజీమంత్రి బిఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి తెలిపారు. దీంతో ఆయకట్టు పెరగడంతో పాటు అనుకున్న పంటలు వేసుకునే వెసలుబాటు రానుందన్నారు. గతంలో కెసిఆర్ ప్రభుత్వం ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు అనేక చర్యలు తీసుకున్నదని అన్నారు.గత ప్రభుత్వాలు ప్రాజెక్టులు నిర్మించక పోవడంతోనే రైతులు ఆత్మహత్య లు చేసుకున్నారని, ఆ పాపం వారిదేనన్నారు. ఆనాడు అక్రమంగా పులిచింతల, పోతిరెడ్డిపాడు లాంటి ప్రాజెక్టులను కట్టి ఆంధ్రాకు అక్రమంగా నీళ్లు తరలిస్తుంటే మీ పౌరుషం ఏమైందని నిలదీశారు. తెలంగాణ ప్రాజెక్టులను పండబెట్టి ఆంధ్ర ప్రాజెక్టులను కడుతున్నప్పుడు ఎక్కడ పోయింది ఈ ఆవేశం అని ప్రశ్నించారు. తెలంగాణలో పెట్టాల్సిన విద్యుత్ ప్రాజెక్టులను విజయవాడ, కడపల్లో పెడుతున్నప్పుడు ఎందుకు మూగబోయింది నిలదీశారు. పాలకులను ఆనాడే నిలదీసి ఉంటే ఇప్పటికే మన ప్రాజెక్టులు పూర్తయ్యేవన్నారు. అరవై ఏండ్లలో సాధించని ఎన్నో విజయాలు నాటి సిఎం కెసిఆర్ సాధించారన్నారు. చిల్లర రాజకీయ విమర్శలు ప్రజలు కోరుకోవడం లేదని, కాంగ్రెస్ పాలకులు హుందాగా వ్యవహరించాలని అన్నారు. కాంగ్రెస్ పాలనపట్ల ప్రజల్లో భ్రమలు తొలిగాయని అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు ఇప్పుడు మాజీ సిఎం కేసీఆర్ పాలన గుర్తొస్తున్నదని అన్నారు. పదేళ్లపాటు బిఆర్ఎస్ పాలనలో తెలంగాణ అభివృద్ధికి కెసిఆర్ పాటుపడ్డారని, 16 నెలలుగా ప్రతిపక్ష పాత్రలో కాంగ్రెస్ ప్రభుత్వానికి హెచ్చరికలు చేస్తున్నా మార్పు కనిపించడం లేదన్నారు. భాజపా, కాంగ్రెస్ పార్టీలు దొందూ దొందేనని విమర్శించారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలని మోదీ, ఆరు గ్యారంటీలు, 420 హామీలతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేశాయని వేముల ఆరోపించారు. రాష్ట్రంలో ఇప్పుడు ఎవరిని అడిగినా కేసీఆర్ సీఎంగా ఉంటే బాగుండేదని అంటున్నారని చెప్పారు. వచ్చే నెలలో వరంగల్‌లో నిర్వహించే పార్టీ రజతోత్సవ సభ విజయవంత్ కోసం బిఆర్ఎస్ కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు.

# అధికారుల అప్రమత్తం

హైదరాబాద్, వేసవి ప్రారంభంతో తెలంగాణలో విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది. ఇది ఏటా జరిగగే ప్రక్రియే. నిరతంర విద్యుత్ సరఫరా కారణంగా ప్రజలు కూడా బిల్లులకు వెరవకుండా వాడేస్తున్నారు. గత నాలుగైదు రోజులు వాతావరణంలో కొంత మార్పుతో చల్లగా ఉన్నా మళ్లీ ఎండవేడిమి అందుకుంది. దీంతో వినియోగంలో ఆల్‌టైమ్ రికార్డు త్వరలో నమోదుకానుందని విద్యుత్ వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణ వచ్చిన నాటి పరిస్థితితో పోల్చుకుంటే ప్రస్తుతం డిమాండ్ అధికమని అంటున్నారు. మున్ముందు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్టు చెబుతున్నారు. విద్యుత్ ప్రసారంలో సమస్యలు రాకుండా చూడాలని సిఎం రేవంత్ రెడ్డి కూడా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. కొందరు విద్యుత్ సమస్యలు సృష్టించాలని చూసినా..వెంటనే గుర్తించి అలాంటి వారికి కత్తెర వేశారు. విద్యుత్ వినియోగం పెరగనుండడంతో కరెంట్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. తెలంగాణలో కరెంటు డిమాండ్ ఆల్ టైమ్ రికార్డుకు దగ్గర్లో ఉంటోంది. అయితే గతేడాది అత్యధికంగా నమోదైన విద్యుత్ డిమాండ్.. ఈ ఏడు ఇప్పటికే అధికమించింది. ఈ నెలాఖరు లోగా 14 వేల మెగావాట్ల విద్యుత్ వినియోగం దాటే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణలో అంతకుమించి విద్యుత్ డిమాండ్ పెరిగింది. అప్పటితో పోలిస్తే కరెంటు కనెక్షన్లు కూడా పెరిగాయి. దీంతో ఎండాకాలం ప్రారంభంలోనే రాష్ట్రంలో కరెంట్ డిమాండ్ పెరుగుతోందని అధికారులు అంటున్నారు. ఇటు ఉక్కపోత కూడా ప్రారంభం కానుండడంతో కొన్ని రోజుల్లోనే కరెంటు వినియోగం భారీగా అవకాశం ఉందని లెక్క కడుతున్నారు. పెరుగుతున్న విద్యుత్ వినియోగానికి అనుగుణంగా పంపిణీ వ్యవస్థను మరింత పటిష్టపరిచేందుకు విద్యుత్ శాఖ ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. అలాగే విద్యుత్ నష్టాలను తగ్గించడం కోసం నాణ్యత కలిగిన మీటర్ల ఏర్పాటు, అధిక సామర్థ్యం ఉన్న కండక్టర్లు మార్చడం వంటివి చేయాలన్న ఆలోచనలో ఉన్నారు. ఏడాదికి వెయ్యి యూనిట్లకు పైగా తలసరి విద్యుత్ వినియోగం జరిగే రాష్ట్రాల్లో తెలంగాణ అత్యధికంగా 10 శాతం వృద్ధిరేటు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది.

# సాక్షులకు స్లో పాయిజన్.. వివేకా కేసులో కుట్ర కోణం!

హైదరాబాద్, వైఎస్ వివేకా హత్య జరిగి ఆరేళ్లయినా కేసులో ఒక్కటంటే ఒక్క అడుగు కూడా ముందుకు పడడం లేదు. ఎటూ తేలడం లేదు. నిందితులు బెయిల్ బై బయట తిరుగుతున్నారు. అప్రూవర్ గా మారినోళ్లు, సాక్ష్యం చెప్పిన వాళ్లే ఒక్కొక్కరుగా అనుమానాస్పద రీతిలో చనిపోతున్నారు. పైగా అందరూ ఒకే తరహాలో అనారోగ్యానికి గురి కావడం.. ఆపై చనిపోవడం.. ఇప్పటిదాకా ఆరుగురు సాక్షులు ఇలాగే చనిపోయారు. స్లో పాయిజన్ చేస్తున్నారా? అందరివీ సహజ మరణాలేనా? వివేకా హత్య కేసు చుట్టూ అసలేం జరుగుతోంది? మిస్టరీ డెత్స్ వెనుకున్న వారెవరో సిట్ ఎంక్వైరీలో దొరుకుతారా?




వైఎస్ వివేకా నివాసం..

మార్చి 15వ తేదీ తెల్లారే సరికి వివేకా హత్యకు గురై కనిపించారు. మొదట గుండెపోటు అన్నారు. రక్తపు వాంతులుగా ప్రచారం చేశారు. బెడ్రూం, బాత్ రూమ్ లో రక్తపు ఆనవాళ్లు కనిపించకుండా పోయాయి. అయితే శరీరంపై గాయాలు బయటకు రాగానే హత్య అన్నది వెలుగులోకి వచ్చింది. వివేకా పీఏ వెంకటకృష్ణారెడ్డి ఫిర్యాదుతో పులివెందులలో క్రైం నెంబర్ 24/2019 గా కేసు నమోదైంది. అంతే అక్కడి నుంచి ఈ వివేకా హత్య కేసు ఎన్ని మలుపులు తిరగాలో అన్ని తిరిగింది. దర్యాప్తులో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. సీబీఐ ఎంట్రీ ఇచ్చింది. సిట్ దర్యాప్తులు చేశాయి. అయినా లాభం లేకుండా పోయింది. వైఎస్ వివేకా హత్యకు గురై ఆరేళ్లు గడిచిపోయింది. అయినా సరే మ్యాటర్ కొలిక్కి రావడం లేదు.

ఒకే తరహాలో సాక్షుల మరణాలు

వివేకా హత్య కేసులో అసలు మ్యాటర్ ఏంటంటే.. అనుమాస్పద వ్యక్తులు, నిందితులు బెయిల్ పై బయట తిరుగుతున్నారు. సీబీఐ ముందు కీలక వాంగ్మూలాలు ఇచ్చిన సాక్షులు మాత్రం వరుసగా చనిపోతున్నారు. ఇప్పటిదాకా ఆరుగురు సాక్షులు చనిపోయారు. పైకి అందరివీ అనారోగ్య కారణాలు, సహజ మరణాలే అని ప్రచారం జరుగుతున్నా.. అందరివీ ఒకే తరహాలో డెత్స్ ఉండడంతో అనుమానాలు పెరుగుతున్నాయి. కీలక సాక్షులు ఇలా వరుసగా చనిపోతుండడంపై ఏపీ ప్రభుత్వం సీరియస్ గా రియాక్ట్ అయింది. అసలు ఈ మిస్టరీ డెత్స్ వెనుకున్నదెవరు.. ఏం జరుగుతోందన్న విషయాలు నిగ్గు తేల్చేందుకు సిట్ ఏర్పాటు చేసింది. 16 మందితో సిట్‌ను ఏర్పాటైంది. సీనియర్ డీఎస్పీ ఆధ్వర్యంలో ముగ్గురు సీఐలు, ఇద్దరు ఎస్సైలు, పది మంది కానిస్టేబుళ్లు రంగంలోకి దిగి ఒక్కో కుటుంబం దగ్గరికి వెళ్లి వివరాలు రాబడుతున్నారు.

సూత్రధారులు, కుట్రదారులు ఎవరు?

వివేకా హత్య కేసు తేల్చేందుకు పోలీసుల ఆధ్వర్యంలో మూడు సిట్‌లు ఏర్పాటు చేసినా మ్యాటర్ ముందుకెళ్లలేదు.ఇది నాలుగో సిట్.వివేకా హత్య కేసు తేలకముందే.. అందులో సాక్ష్యం చెప్పిన వారికి మాత్రం నూకలు చెల్లుతున్నాయి. ఇది అన్నిటికంటే పెద్ద సవాల్ గా మారింది.ఇలా సాక్ష్యులందరూ అడ్రస్ లేకుండా పోతుండడం కలవరానికి కారణమవుతోంది.కేసులో సూత్రధారులు, కుట్రదారులను తేల్చకముందే మొత్తంగా భూస్థాపితం చేస్తారా అన్న డౌట్లు పెరుగుతున్నాయి.అసలు అవి సహజ మరణాలా లేక.. స్లో పాయిజన్ ఇచ్చి చంపేస్తున్నారా.. అన్నది ఇప్పుడు పెద్ద మిస్టరీ. దీన్ని తేల్చేందుకే సిట్ రంగంలోకి దిగింది.

వాచ్ మెన్ రంగయ్య మిస్టరీ డెత్

వివేకా హత్యకు గురైనప్పుడు ఆ ఇంట్లో వాచ్ మెన్ గా రంగయ్య పని చేశాడు. నిందుతుల్ని కళ్లారా చూసింది ఆయనే. సాక్షుల లిస్టులో కీలకంగా ఉన్న ఆయన కూడా ఇటీవలే అనారోగ్యంతో చనిపోయాడు. అయితే తమ తండ్రి మరణంపై డౌట్లు ఉన్నాయని ఆయన కొడుకు కంప్లైంట్ ఇవ్వగా.. దానిపైనా దర్యాప్తు కొనసాగుతోంది. గతంలో సీబీఐ ఈ కేసులో దర్యాప్తు చేస్తూ.. రంగయ్య వాంగ్మూలాన్ని సేకరించింది. అప్పుడే ఈ కేసు కీలక మలుపు తిరిగింది. ఎర్రగంగిరెడ్డి, సునీల్ యాదవ్, ఉమాశంకర్‌రెడ్డి, దస్తగిరి హత్యలో పాల్గొన్నట్లు ప్రాథమికంగా తేల్చింది. వీరందరినీ అరెస్ట్ చేయగా దస్తగిరి నేరాన్ని అంగీకరించి అప్రూవర్‌గా మారాడు.

నిందితులు బాగానే ఉన్నా సాక్షుల్లోనే టెన్షన్

ఆయన ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ఈ కేసులో అసలు కుట్రధారులైన దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి, గజ్జల ఉదయ్‌కుమార్‌రెడ్డితోపాటు వైఎస్ భాస్కర్ రెడ్డిని సీబీఐ అరెస్ట్ చేసింది. దీంతో వివేకా హత్య కేసు మరో లెవల్ కు వెళ్లినట్లయింది. కడప ఎంపీ అవినాష్‌రెడ్డి చుట్టూ కూడా మ్యాటర్ హీటెక్కినా అరెస్ట్ దాకా వెళ్లలేదు. ప్రస్తుతానికి ఎర్రగంగిరెడ్డి మినహా మిగిలిన నిందితులంతా బెయిల్‌పై బయటకు వచ్చారు. వాళ్లు బాగానే ఉన్నారు. సీబీఐకి సాక్ష్యం చెప్పిన వారు మాత్రం వరుసగా అనుమానాస్పద రీతిలో చనిపోతున్నారు. మరోవైపు కేసు విచారణ సీబీఐ కోర్టులో త్వరగా ప్రారంభించే విధంగా ఆదేశాలు ఇవ్వాలని వివేకా కుమార్తె వైఎస్ సునీత తెలంగాణ హైకోర్టును ఇటీవలే ఆశ్రయించారు. అటు సాక్షుల మరణాలపై ఏర్పాటు చేసిన సిట్ ఎంక్వైరీలో ఏం తేలుతుందన్నది ఉత్కంఠగా మారింది.

వివేకా హత్య కేసు క్లైమాక్స్ కు చేరుతుందా?

వివేకా హత్య కేసులో సాక్షుల మరణాలపై విస్తుపోయే వాస్తవాలు బయటికొస్తున్నాయా? నిజంగానే అనారోగ్యాలతో చనిపోయారా? ఏం జరిగింది? మృతుల కుటుంబ సభ్యులు సిట్ కు చెబుతున్నదేంటి? వాచ్ మెన్ రంగన్నకు స్లో పాయిజన్ ఇచ్చి చంపేశారన్నది నిజమేనా? దర్యాప్తులో ఏం తేలుతోంది? వివేకా హత్య కేసు క్లైమాక్స్ కు చేరుతుందా?

ఎర్రగంగిరెడ్డిపై వాంగ్మూలమిచ్చిన రంగన్న

వివేకా హత్య కేసులో సాక్షుల వరుస మరణాలపై సిట్ దర్యాప్తు స్పీడప్ చేసింది. ఈ కేసులో అందరికంటే కీలకమైన వ్యక్తి వాచ్ మెన్ రంగన్న. నిందితులను కళ్లారా చూసింది ఈయనే. పేర్లు చెప్పిందీ ఈయనే. వయసు 65. కొద్ది రోజుల క్రితమే అనారోగ్యంతో చనిపోయారు. వివేకా హత్య గురించి ఎవరికైనా చెబితే నరికి చంపేస్తానంటూ ఎర్ర గంగిరెడ్డి అప్పట్లో తనను బెదిరించారని కూడా రంగన్న వాంగ్మూలమిచ్చాడు. అయితే రంగన్న అస్వస్థతకు గురయ్యారంటూ మొదట పులివెందుల హాస్పిటల్ కు తీసుకెళ్లారు. అక్కడి నుంచి కడప రిమ్స్‌కు తరలించగా..చికిత్స పొందుతూ చనిపోయారు.రంగన్న కాలికి గతేడాది గాయమైంది.పులివెందుల, కడప, తిరుపతి, హైదరాబాద్ దాకా తీసుకెళ్లి ట్రీట్ మెంట్ ఇప్పించారు.

ట్రీట్మెంట్ పై డౌట్లు ఉన్నాయన్న రంగన్న కొడుకు

ఆ తర్వాతే ఆయన తీవ్ర అనారోగ్యానికి గురయ్యారని రంగన్న కొడుకు అంటున్నారు. అప్పట్లో చికిత్స వివరాలు కోరినా పోలీసులు తమకు ఇవ్వలేదని, ఆ ట్రీట్మెంట్ పై అనుమానాలున్నాయంటూ రంగన్న భార్య, కుమారుడు కాంతారావు ఆరోపించారు. పోలీసులు కూడా ఇది మిస్టరీ డెత్ గా తేల్చి దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే రంగన్న మృతదేహానికి రెండుసార్లు పోస్టుమార్టం నిర్వహించి 20 రకాల అవయవ భాగాలను సేకరించి నాలుగు ఫోరెన్సిక్ ల్యాబ్‌లకు పంపించారు. నివేదిక వచ్చేలోగా ఆయన మరణంపై ఉన్న అనుమానాలను క్లారిఫై చేసేందుకు టెక్నికల్ ఎంక్వైరీ నడుస్తోంది. స్లో పాయిజన్ ఏమైనా ఇచ్చారా అనే కోణంలో కూడా సిట్ దర్యాప్తు చేస్తోంది. ఫోరెన్సిక్ రిపోర్ట్ వస్తే అవయవాల్లో ఏవైనా పాయిజన్ అవశేషాలు ఉన్నాయా అన్నది తేలుతుంది. అదే జరిగితే సాక్షుల వరుస మిస్టరీ డెత్స్ కు సమాధానం రావడం ఖాయమే అంటున్నారు.

2019 డిసెంబర్ 6న నారాయణ మృతి

ఇదే కేసులో మిస్టరీగా చనిపోయిన వారెవరో ఇప్పుడు చూద్దాం. ఈయన పేరు నారాయణ యాదవ్. మాజీ సీఎం జగన్ వెహికిల్ డ్రైవర్. వివేకా చనిపోయాడని తెలియగానే.. జగన్, భారతి ఇద్దరూ హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గంలోనే పులివెందులకు వెళ్లారు. అప్పుడు వెహికిల్ డ్రైవ్ చేసింది నారాయణ యాదవే. ఈయన 2019 డిసెంబర్ 6న అనారోగ్య కారణాలతో చనిపోయినట్లు ప్రచారం జరిగింది. రోడ్డు మార్గంలో వెళ్తున్నప్పుడు ఏం జరిగింది అన్నది క్వశ్చన్ మార్క్ గానే ఉండిపోయింది. ఈయన మృతిపై కేసు నమోదు కాలేదు. అతడి అంత్యక్రియలకు జగన్, భారతి హాజరయ్యారు.

వివేకా హత్య కేసు ప్రధాన సాక్షుల్లో గంగాధర్ రెడ్డి

ఇతని పేరు గంగాధర్ రెడ్డి. వివేకా హత్య కేసు ప్రధాన సాక్షుల్లో ఒకరు. ఈయన కూడా 2022 జూన్ 9న చనిపోయాడు. అనారోగ్యంతో మృతి చెందారంటూ అప్పట్లో ప్రచారం చేశారు.

# పార్లమెంట్ క్యాంటీన్‌లో అరకు కాఫీస్టాల్

న్యూఢిల్లీ, ఇకపై పార్లమెంట్‌లో ఎంపీలంతా అరకు కాఫీని రుచిచూసేలా స్టాల్‌ను ప్రారంబించారు. ఇందుకోసం సోమవారం క్యాంటీన్ సంగం-1లో అరకు కాఫీ స్టాల్‌ను పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రారంభించారు.. కేంద్ర గిరిజన శాఖ మంత్రి జువల్ ఓరం, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడితోపాటు కూటమి ఎంపీలంతా అరకు కాఫీ స్టాల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. అరకు కాఫీకి విస్తృత ప్రచారం కల్పించేందుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అవకాశం ఇవ్వడంతో... పార్లమెంట్ ఆవరణలో అరకు కాఫీ స్టాల్ అందుబాటులోకి వచ్చింది. 2 కాఫీ స్టాల్స్ ఏర్పాటు చేసుకోవడానికి అనుమతి ఇవ్వడంతో సంగం 1, 2 కోర్ట్ యార్డ్ వద్ద ఈ స్టాల్స్ ఏర్పాటు చేశారు.. దీనికి సంబంధించి సోమరవారం నుంచి కాఫీ స్టాల్స్ అందుబాటులోకి వచ్చాయి..కాఫీ స్టాల్స్ ప్రారంభం కోసం రెండ్రోజుల ముందే గిరిజన కోఆపరేటివ్ సొసైటీ అధికారులు ఢిల్లీకి వెళ్లారు. ఏపీ మంత్రి గుమ్మడి సంధ్యారాణి కూడా అక్కడే ఉన్నారు. అరకు కాఫీకి ఈ స్థాయి గుర్తింపు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఏపీ గిరిజనుల కష్టాన్ని ప్రపంచం గుర్తించబోతున్నందుకు గర్వంగా కూడా ఉందని తెలిపారు. గిరిజనలుకు ఉపాధి కల్పించి, వారి కాఫీని ప్రమోట్ చేయడానికి చంద్రబాబు నిర్ణయం మేరకు ఇక్కడ కాఫీ స్టాల్ ఏర్పాటు చేశామని మంత్రి రమ్మోమన్ నాయుడు తెలిపారు. ఈ కాఫీ రుచి చాలా బాగుందని కేంద్రమంత్రి కిరణ్ రిజు తెలిపారు. మంత్రి పీయూష్ గోయల్ కూడా అరకు కాఫీని అభినందించారు. మనమంతా ఈ కాఫీని ప్రమోట్ చేయాలన్నారు. అరకు కాఫీ కోసం చంద్రబాబు ఇప్పటికే ఎక్కడికి వెళ్లినా ప్రమోట్ చేస్తున్నారు.

# 'గ్రోక్' ప్రకంపనలు..

హైదరాబాద్, దేశ రాజకీయాల్లో 'గ్రోక్' సంచలనం రేపుతోంది. 'ఎక్స్' (ట్విట్టర్)కు చెందిన ఈ చాట్ బాట్.. కేంద్రం అధికార బీజేపీకి పంటి కింద రాయిలా ఇబ్బంది పెడుతున్నది. 11 ఏండ్లుగా ప్రధాని అధికారంలో ఉండి చక్రం తిప్పుతున్న మోదీకి, ఇతర అధికారపక్ష కీలక నాయకులకు కొత్త తలనొప్పులు తెచ్చిపెడుతోంది. దాదాపు దశాబ్దన్నర కాలంగా సోషల్ మీడియాలో, దేశంలోని ఇతర డిజిటల్ వేదికల్లో పెత్తనం చెలాయిస్తున్న బీజేపీ దూకుడుకు బ్రేకులు వేస్తోంది. బీజేపీ ఏకంగా 'గో బ్యాక్ గ్రోక్' ఉద్యమం ప్రారంభించిందంటేనే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఎలా మొదలైందంటే..

టోకా అనే ఎక్స్ ఖాతా నుంచి కొన్ని రోజుల కింద వచ్చిన ఒక ప్రశ్నతో దేశంలో గ్రోక్ సంచలనాలు మొదలయ్యాయని చెప్తున్నారు. తనతోపాటు ఉన్న వారిలో తనలాంటి భావజాలం ఉన్న పదిమందిని ఎంపిక చేయడానికి టోకా ఒప్పందం. గ్రోక్ ఆలస్యంగా సమాధానం ఇవ్వడంతో టోకా అసహనం వ్యక్తం చేస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. దీనితో చాట్ బాట్ ఎదురుదాడి ప్రారంభించింది. టోకాకు హిందీలో సమాధానం ఇవ్వాలంటే కొన్ని బూతులు వాడింది. దీనితో గ్రోక్ వ్యవహార శైలిపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరిగింది. ఆ తర్వాత అనేక వరుస ప్రశ్నలు గుప్పిస్తూ దానిని రెచ్చగొట్టారు.వాటన్నింటికీ ఏఐ చాట్ బాట్ నిర్మొహమాటంగా, ఘాటు వ్యాఖ్యలతో సమాధానాలు ఇస్తుండడంతో ప్రశ్నల వరద పెరిగింది. ఈ మాజీ ప్రధాని మోదీ, బీజేపీ, రాహుల్ గాంధీ, కాంగ్రెస్‌పై అడిగిన ప్రశ్నలకు గ్రోక్ ఇచ్చిన సమాధానాలు సంచలనంగా మారాయి. అప్పటి నుంచి రాజకీయ ప్రకంపనలు మొదలయ్యాయి. నిజానికి గ్రోక్ మొదటి నుంచి ఇలాంటి సమాధానాలు ఇస్తున్నారని నిపుణులు చెబుతున్నారు. మస్ ఎవరు? అని ఒకరు ప్రశ్నించగా.. ఎక్స్‌లో అత్యధిక నకిలీ వార్తలు సృష్టించిన వ్యక్తిగా అభివర్ణించారు. తన సృష్టికర్తపైనే ఘాటు వ్యాఖ్యలు చేసింది.

మోదీ, అమిత్ షాను అరెస్ట్ చేస్తారట..

రాజకీయ ప్రశ్నలకు గ్రోక్ ఇస్తున్న సమాధానాలు సంచలనం రేపుతున్నాయి. ముఖ్యంగా ప్రధాని మోదీ, బీజేపీ నేతల మీద అడుగుతున్న ప్రశ్నలకు గ్రోక్ ఇస్తున్న సమాధానాలు కమలనాథులకు మింగుడు పడటం లేదు. మోదీ ప్రధాని అయ్యాక నిర్వహించిన ప్రెస్‌ఫరెన్స్‌ల గురించి కాన్ఫరెన్స్ రావాలని కోరగా.. మోదీ మీడియా ముందుకు రాలేదు, మాట్లాడే పనిని అమిత్ షాకు అప్పగించారంటూ సమాధానం ఇచ్చింది. అంతేకాదు మోదీ ఇచ్చే ఇంటర్వ్యూలన్నీ స్క్రిప్టెడ్ (ముందే సిద్ధం చేసుకున్న ప్రశ్న, జవాబులు) గా అనిపిస్తున్నాయని వ్యాఖ్యానించింది. దీనితో గ్రోక్ చుట్టూ రాజకీయాలు తిరగడం మొదలయ్యాయి. దేశంలోని అనేక ప్రముఖ మీడియా సంస్థల పేర్లను, వాటిలోని ముఖ్య అధికారులు పేర్లను చెప్పింది. మోదీతో సన్నిహితంగా ఉన్న అదానీ, అంబానీ వంటి పెద్దలు పెద్దపెద్ద మీడియా సంస్థలపై బీజేపీ ప్రభావం గురించి అడగగా. సంస్థలకు అధిపతులుగా ఉన్నారని పేరొచ్చింది.బీజేపీ తనకు అనుకూల వార్తలను ప్రచారం చేయడంతో పాటు, వ్యతిరేక కథనాలను, వార్తలను తిప్పి కొట్టడానికి సంవత్సరానికి ఏకంగా 140 మిలియన్ డాలర్లు ఖర్చు చేస్తున్నదని సమాధానం ఇచ్చింది. ముఖ్యంగా 2014 నుంచి విమర్శకుల గొంతులను నొక్కుతున్నట్టు నటించింది. మత విద్వేషాలను వ్యాప్తి చేయడానికి ఏ రాజకీయ నాయకులను అరెస్టు చేస్తారని ఓ నెటిజన్ అడగగా.. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, బీజేపీ నేత గిరిరాజ్ సింగ్ వంటి వారు మతవిద్వేషాలను ఎక్కువగా ప్రచారం చేసేందుకు గ్రోక్ పేరొన్నది. దీనితో గ్రోక్ సమాధానాలపై విస్తృతంగా చర్చ జరుగుతోంది. మరోవైపు గ్రోక్ వాడుతున్న పదజాలంపై అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో ఏఐ చాట్ బాట్ వాడే భాషపై కొంత నియంత్రణ ఉండేదని, గ్రోక్ ఆ హద్దులను చెరిపేసిందని అంటున్నారు. ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో మరింత ఘాటు వ్యాఖ్యలు చేసే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

# నగరంలో వరుస హత్యలపై హడల్

హైదరాబాద్,నగరంలో వరుస హత్యలు కలకలం రేపుతున్నాయి. ఆదివారం ఓ వ్యక్తిని పాత కక్షల నేపథ్యంతో దారుణంగా నరికి చంపిన సంగతి తెలిసిందే. ఈ ఘటన మరువక ముందే సోమవారం ఉదయం పట్టపగలు మరో దారుణం చోటు చేసుకుంది. అందరూ చూస్తుండగా ఓ లాయర్ దారుణ హత్యకు గురయ్యాడు. వివరాల్లోకెళ్తే.. చంపాపేట డివిజన్ ఐఎస్ సదన్‌లో సోమవారం ఉదయం ఓ లాయర్ దారణహత్యకు గురయ్యాడు. అంబేద్కర్‌వాడలో న్యాయవాది ఇజ్రాయెల్‌ను దస్తగిరి అనే వ్యక్తి కత్తితో పొడిచాడు. తీవ్రగాయాల పాలైన అతడిని వెంటనే అపోలో ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ లాయర్ ఇజ్రాయెల్ మృతి చెందాడు. అడ్వకేట్ ఇజ్రాయెల్ ఇంట్లో ఓ మహిళ కిరాయికి ఉంటున్నది. ఆమెను దస్తగిరి అనే ప్రైవేటు ఎలక్ట్రీషియన్ గతకొంతకాలంగా వేధిస్తున్నాడని ఇజ్రాయెల్‌ను ఆశ్రయించింది. దీంతో బాధితురాలి తరఫున ఇజ్రాయెల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయం తెలుసుకున్న దస్తగిరి లాయర్ ఇజ్రాయెల్‌పై కక్షపెంచుకున్నాడు. నాపైనే పోలీసులకు ఫిర్యాదు చేస్తావా? అంటూ దస్తగిరి సోమవారం ఉదయం అడ్వకేట్‌పై దాడిచేసి హత్య చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. కేసు నమోదుచేసి నిందితుడిన అదుపులోకి తీసుకున్నారు. పట్టపగలు అందరూ చూస్తుండగా ఈ దారుణం చోటు చేసుకోవడంతో స్థానికులు భయంతో హడలెత్తిపోయారు.

# బనకచర్ల.. సీమ గేట్‌వే!



అమరావతి, పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకానికి రాయలసీమకు గేట్‌వేలాంటిదని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. జాతీయ నదుల అనుసంధానంలోనూ కీలక భూమిక వహించే ఈ ప్రాజెక్టుకు ఆర్థికంగా చేయూతనివ్వాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు అధ్యయన దశలో ఉందన్నారు. రూ. 81,900 కోట్ల వ్యయమవుతుందన్నది ప్రాథమిక అంచనాగా పేర్కొన్నారు. ఈ పథకాన్ని హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్‌ఏఎం).. అంటే పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో నిర్మించతలపెట్టామని తెలిపారు. 3 లక్షల హెక్టార్ల ఆయకట్టు స్థిరీకరణ, కొత్తగా 9.14 లక్షల హెక్టార్ల ఆయకట్టుకు సాగునీరు, 80 లక్షల మందికి తాగునీరు, పారిశ్రామికావసరాలకు 20 టీఎంసీలు, 200 మెగావాట్ల విద్యుదుత్పత్తి లక్ష్యమన్నారు. ఇందుకోసం రోజుకు రెండు టీఎంసీల చొప్పున 100 రోజుల పాటు 200 టీఎంసీల గోదావరి వరద జలాలను ఈ ప్రాజెక్టుకు తరలిస్తామని వివరించారు. ఇప్పటికే లైడార్, డ్రోన్ సర్వేలు చేపడుతున్నామని తెలిపారు. కరువు సీమ రాయలసీమతో పాటు.. పల్నాడునూ సస్యశ్యామలం చేసే ఈ పథకాన్ని జాతీయ నదుల అనుసంధాన పథకంలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కింద దీనికి ఆర్థికంగా సాయం అందించి కేంద్రమే పూర్తి చేయాలని కోరారు. ఇటీవలి ఢిల్లీ పర్యటనలో నిర్మలా సీతారామన్‌కు ఈ మేరకు మూడు పేజీల లేఖ అందజేశారు. ఈ పథకాన్ని మూడు దశల్లో చేపట్టేలా కార్యాచరణ ప్రణాళికలను రూపొందించినట్లు తెలిపారు. దశలవారీగా వివరాలివీ..

తొలి దశ: ప్రకాశం బ్యారేజీలోకి ఎత్తిపోత

పోలవరం-బనకచర్ల మొదటి దశ కింద గోదావరి జలాలను పోలవరం డ్యాం నుంచి కుడి ప్రధాన కాలువ ద్వారా ప్రకాశం బ్యారేజీకి మళ్లిస్తారు. ఇప్పటికే ఈ కుడి కాలువ ద్వారా పట్టిసీమ నుంచి 80 టీఎంసీలను కృష్ణా డెల్టాకు మళ్లిస్తున్నాం. ఈ కాలువ సామర్థ్యం పెంచి.. రోజుకు 18,000 క్యూసెక్కుల నుంచి 35,000 క్యూసెక్కుల చొప్పున రెండు టీఎంసీల చొప్పున 100 రోజులు ఎత్తిపోస్తాం. ఇందుకు 290 మెగావాట్ల విద్యుత్ అవసరం. కుడికాలువ విస్తరణకు 9,000 ఎకరాల భూమి సేకరించాలి. అలాగే దీనికి సమాంతరంగా 40 కిలోమీటర్ల మేర కొత్త కాలువ నిర్మించాల్సి ఉంటుంది. ఈ దశకు రూ.13,800 కోట్లు వ్యయమవుతుందని అంచనా.

2వ దశ: బొల్లాపల్లి రిజర్వాయర్లోకి ఎత్తిపోత

పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుకు వెన్నెముక బొల్లాపల్లి రిజర్వాయరు. దీని సామర్థ్యం 173 టీఎంసీలు. రెండో దశలో ప్రకాశం బ్యారేజీ ఫోర్‌షోర్ నుంచి ఆరు దశల్లో ఈ రిజర్వాయరులోకి నీటిని ఎత్తిపోస్తాం. దీనికి మరో ప్రత్యామ్నాయం 1.2 కిలోమీటర్ల పొడవున టన్నెల్‌ను నిర్మించడం. అయితే మొదటి ప్రణాళికతోనే సాంకేతికంగా, ఆర్థికంగా లబ్ధి చేకూరుతుంది. దీని అమలుకు కేవలం 15 గ్రామాలకు సహాయ, పునరావాసం కల్పిస్తే సరిపోతుంది. పైగా జాతీయ స్థాయిలో నిర్మించే రిజర్వాయర్లకు ఒక టీఎంసీకి సగటున రూ.100 కోట్ల నుంచి 200 కోట్లు వ్యయమవుతుంటే.. బొల్లాపల్లి రిజర్వాయరుకు టీఎంసీకి సగటున రూ.30 కోట్లు మాత్రమే ఖర్చవుతుంది. పైగా దీని ద్వారా 230 మెగావాట్ల జలవిద్యుదుత్పత్తి కూడా జరుగుతుంది. ఈ రిజర్వాయరు నిర్మాణానికి రూ.35,760 కోట్ల వ్యయమవుతుందని అంచనా.

మూడో దశ: 3 ఎత్తిపోతలతో..

మూడో దశలో బొల్లాపల్లి నుంచి రోజుకు రెండు టీఎంసీలను బనకచర్ల హెడ్‌రెగ్యులేటర్‌కు తరలించేందుకు 3 ఎత్తిపోతల పథకాలను నిర్మించాల్సి ఉంటుంది. ఆ రిజర్వాయరు నుంచి సిద్ధాపురం చెరువుకు నీటిని తీసుకెళ్లి.. అక్కడి నుంచి 11 కిలోమీటర్ల టన్నెల్ మార్గం గుండా బనకచర్ల హెడ్‌రెగ్యులేటర్‌లోకి తరలించాలి. సిద్ధాపురం నుంచి నీటిని తోడిన తర్వాత.. కాలువ ద్వారా 200 మెగావాట్ల జల విద్యుత్‌ను ఉత్పత్తి చేసే వీలుంది. అలాగే నల్లమల సాగర్ నుంచి వెలిగొండ ప్రాజెక్టుకు కూడా 0.5 టీఎంసీని తరలించాలి. మూడో దశ పూర్తి చేసేందుకు రూ.32,350 కోట్ల ఖర్చవుతుందని అంచనా. మొత్తంగా మూడు దశల్లో ప్రాజెక్టు నిర్మాణానికి రూ.81,900 కోట్లు వ్యయమవుతాయి.

# రేవంత్ కొత్త మంత్రులు వీరే అంటూ ప్రచారం !



హైదరాబాద్,తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదహారు నెలలు నిండి పోయాయి. మొత్తం మంత్రివర్గంలో ముఖ్యమంత్రి కాకుండా 17 మంది దాకా తీసుకునే చాన్స్ ఉంది. కానీ 2023 డిసెంబర్ లో కాంగ్రెస్ మంత్రివర్గంలో ఆరు ఖాళీలను ఉంచేసి మిగిలిన వారితో కలసి ముఖ్యమంత్రిగా రేవంత్ ప్రమాణం చేసారు. ఇక అదిగో ఇదిగో ఆ ఖాళీలు భర్తీ అంటూ ఇంతకాలం గడిపేశారు.అయితే ఎట్టకేలకు ఆ గడువు దగ్గర పడింది అని అంటున్నారు. ఉగాదికి మంత్రివర్గ విస్తరణ అని ప్రచారం అయితే ఊపందుకుంది. దానికి తోడు అన్నట్లుగా సీఎం రేవంత్ రెడ్డి పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తో పాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వంటి కీలక నేతలు అంతా ఢిల్లీ చేరుకుని హైకమాండ్ తో భేటీ కావడంతో కొత్త మంత్రుల లిస్ట్ మీదనే ఇదంతా అని చర్చ సాగుతోంది.ఈ క్రమంలో ఎవరెవరికి మంత్రులుగా చాన్స్ ఉంది అన్న దాని మీద రకరకాలైన ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో ఒక లిస్ట్ కూడా చక్కర్లు కొడుతోంది. ఉగాది శుభవేళ కాబోయే మంత్రులు వీరే అని కూడా ప్రచారం సాగుతోంది.ఈ జాబితా చూస్తే కనుక సామాజిక వర్గాల కూర్పుతో ఆరుగురు కొత్త మంత్రులు రేవంత్ రెడ్డి కేబినెట్ లో చేరుతారు అని అంటున్నారు. ముస్లిం మైనారిటీ నుంచి ఒకరు, బీసీల నుంచి ఇద్దరు, ఎస్సీల నుంచి ఒకరికి ఎస్టీస్ నుంచి ఒకరికి, రెడ్డీస్ నుంచి ఒకరికి చాన్స్ దక్కుతుంది అన్నది హస్తిన కాంగ్రెస్ వర్గాల నుంచి ప్రచారంగా ఉంది.ఇక బీసీలలో చూస్తే కనుక ఇటీవలనే ఎమ్మెల్సీ అయిన సినీ నటి విజయశాంతి పేరు ప్రముఖంగా వినిపించడం విశేషం. ఆమెకు హైకమాండ్ మద్దతు ఉందని అంటున్నారు. ఆమెకు ఎమ్మెల్సీ ఇవ్వడమే మంత్రి వర్గంలో చోటు కోసం అని అంటున్నారు. తెలంగాణా కాంగ్రెస్ లో మహిళలకు ఫైర్ బ్రాండ్ కి స్థానం ఇచ్చి జనంలో గ్లామర్ ఉన్న వారిని పంపించాలన్న విధానం మేరకే విజయశాంతి పేరు ముందుకు వస్తోంది అని అంటున్నారు.అదే విధంగా మరో మరో కీలక బీసీ నేతకు మంత్రి పదవి అని అంటున్నారు. ముస్లిం మైనారిటీ కోటాలో ఎమ్మెల్సీ నుంచి ఒకరికి చాన్స్ అని అంటున్నారు. అలా చూస్తే కనుక షబ్బీర్ అలీకి మంత్రి పదవి ఇస్తారని అంటున్నారు. ఎస్సీల నుంచి గడ్డం వివేక్ కి మంత్రి పదవి ఖాయమని చెబుతున్నారు. రెడ్డీస్ కోటా నుంచి చాలా మంది పేర్లు వస్తున్నాయి. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సోదరుడు రాజగోపాల్ రెడ్డి పేరు కూడా వినిపిస్తోంది. అయితే ఒకే కుటుంబానికి చెందిన వారికి పదవి ఇవ్వరని అంటున్నారు.రంగారెడ్డి ఆదిలాబాద్, నిజామాబాద్ వంటి జిల్లాలకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేకపోవడంతో దానిని కూడా దృష్టిలో ఉంచుకుంటారు అని అంటున్నారు. దాంతో నిజామాబాద్ నుంచి సీనియర్ నేత సుదర్శన్ రెడ్డి పేరు కూడా మంత్రి పదవి రేసులో వినిపిస్తోంది. మొత్తం మీద చూసుకుంటే కాబోయే మంత్రులు ఎవరో తెలుగు వారి కొత్త సంవత్సరం ఎవరి జాతకంలో రాజయోగం ఉందో చూడాలని అంటున్నారు.

# కాంగ్రెస్ రూట్లోనే బీజేపీ..!?

న్యూఢిల్లీ,కొద్దిరోజుల క్రితం కర్ణాటకలోని కాంగ్రెస్ సర్కారు ముఖ్యమంత్రి, మంత్రి, ఎమ్మెల్యేల జీతాలు వందశాతం పెంచింది.కర్ణాటకలో ఎమ్మెల్యేల జీతాలపై రచ్చ చేస్తున్న బీజేపీ నేతలకు కేంద్రంలోని కమలం నేతలు ఝలక్ ఇచ్చారు. పార్లమెంటు సభ్యులు, మాజీ సభ్యుల జీతాలు, ఇతర అలవెన్సులను భారీగా పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో కర్ణాటకలోని కాషాయ నేతలు ఇరకాటంలో పడిపోయారంటున్నారు.

కొద్దిరోజుల క్రితం కర్ణాటకలోని కాంగ్రెస్ సర్కారు ముఖ్యమంత్రి, మంత్రి, ఎమ్మెల్యేల జీతాలు వందశాతం పెంచింది. ముఖ్యమంత్రి నెల జీతం రూ.లక్ష ఉంటే ఒకేసారి లక్ష చేసింది. దీనిపై అక్కడి ప్రతిపక్షం బీజేపీ మండిపడుతుండగా, కేంద్రంలోని బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం కూడా ఎంపీల జీతం పెంచడంతో కర్ణాటక నేతలు ఆత్మరక్షణలో పడిపోయారంటున్నారు.పార్లమెంటు సభ్యుల జీతాలు, డైలీ అలవెన్సులు, పెన్షన్, అదనపు పెన్షన్ పెంచుతూ కేంద్ర ప్రభుత్వం అనూహ్య నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం పార్లమెంటు సభ్యుల జీతం రూ.లక్ష ఉండగా, దాన్ని ఏకంగా రూ.1.24 లక్షలకు పెంచింది. డైలీ అలవెన్సులు రూ.2 వేలు నుంచి రూ.2,500 చేసింది. ఇక మాజీ సభ్యుల పెన్షన్ ను నెలకు రూ.25 వేల నుంచి రూ.31 వేలు చేసింది. మాజీ సభ్యుల అదనపు పెన్షన్ కూడా రూ.2,500కు పెంచింది. ఈ మార్పు 2023 ఏప్రిల్ నుంచి వర్తిస్తుందని ప్రకటించింది.అయితే కేంద్రం పెంచిన జీతాలు కర్ణాటకలో బీజేపీ నేతలకు షాకిచ్చాయి. ఎందుకంటే ఇప్పటికే అక్కడి



ఎమ్మెల్యేలకు పెంచి జీతాలపై బీజేపీ నేతలు పెద్ద పోరాటమే చేస్తున్నారు. ప్రజాధనాన్ని ప్రజాప్రతినిధులకు దోచిపెడుతన్నారని ఆరోపిస్తున్నారు. బీజేపీ నేతల విమర్శలను కాంగ్రెస్ కొట్టిపడేస్తోంది. సాధారణ ప్రజలకు ఖర్చులు పెరిగినట్లే ఎమ్మెల్యేలకు ఖర్చులు ఉంటాయని చెప్పుకువస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్రమూ వేతనాలు పెంచడంతో బీజేపీ ఏం చెబుతుందని కాంగ్రెస్ నుంచి ఎదురు ప్రశ్నవచ్చే అవకాశం ఉందంటున్నారు. మొత్తానికి చడీచప్పుడు లేకుండా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రజాప్రతినిధులకు ఆనందం పంచినా, కర్ణాటక కాషాయదళం మాత్రం ఎలా స్పందించాలో తెలియక బిక్కముఖం వేసిందంటున్నారు.

# ఎలక్ట్రిక్ వాహనాలకు భారీగా ప్రోత్సాహకాలు...

న్యూఢిల్లీ, ప్రస్తుతం అడ్డూ అదుపు లేకుండా పెరిగిపోతున్నపెట్రోల్, డీజిల్ ధరలతో వాహనదారులకు మరింత భారంగా మారుతోంది. ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై దృష్టి సారించాల్సిన ఆగత్యం ఏర్పడింది. ఎలక్ట్రిక్ వాహనాల ఆవశ్యకత పెరిగింది. ముఖ్యంగా వాహనాల ఇంధన ధరలు పెరుగుతున్న నేపథ్యంలో పలు వాహనాల తయారీ కంపెనీలు ఎలక్ట్రిక్ వాహనాలను అందుబాటులోకి తీసుకువస్తున్నాయి. దీంతో వాహనదారులు కూడా ఎలక్ట్రిక్ వాహనాల వైపు మొగ్గు చూపుతున్నారు.

తయారీదారులను ప్రోత్సాహించాని కేంద్రం కూడా ఆలోచిస్తోంది. రిజిస్ట్రేషన్ ఛార్జీలను గణనీయంగా తగ్గిస్తున్నాయి. ఇది అమల్లోకి వస్తే రానున్న రెండు మూడేళ్లలో ఈ తరహా వాహనాలకు గిరాకీ పెరగ గనుంది. కేంద్ర ప్రభుత్వం కాలుష్యానికి కారణమవుతున్న పెట్రోల్, డీజిల్ వాహనాలను తగ్గించి కేవలం ఎలక్ట్రిక్ వాహనాలనే నడపాలని భావిస్తోంది. ఇందుకోసం ఓ భారీ ప్రణాళిక సైతం రచించింది. ఇప్పటికే చాలా మంది పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతుండటంతో ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేస్తున్నారు. ముందుగా ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు అందుబాటులోకి రాగా, కార్లు కూడా వచ్చేస్తున్నాయి. ఇక రానున్న రోజుల్లో ఎలక్ట్రిక్ వాహనాలు ధరలు తగ్గనున్నాయని కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. అలాగే ఛార్జింగ్ స్టేషన్లు కూడా అధిక మొత్తంలో ఏర్పాటు అయ్యేందుకు అనుమతులు కూడా మంజూరు చేసినట్లు తెలిపారు. వచ్చే రెండేళ్లలో పెట్రోల్, డీజిల్ వాహనాలకు సమానంగా ఎలక్ట్రిక్ వాహనాల ధరలు ఉంటాయని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లు పెద్దగా లేవు. ధరల విషయంలో పలు డిస్కౌంట్లు, ఆఫర్లు చేస్తోంది ప్రభుత్వం. భారత్‌లో భారీ మొత్తంలో ఎలక్ట్రిక్ వాహనాలను తీసుకువచ్చేందుకు అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తున్నాయి. దీంతో



వాహనాల ధరలు దిగి వస్తాయని మంత్రి తెలిపారు. ఇక ఎలక్ట్రిక్ వాహనాలు అందుబాటులోకి వస్తుండటంతో ఛార్జింగ్ స్టేషన్లు కూడా భారీగా ఏర్పాటు కానున్నాయి. ఫేమ్ ఇండియా స్కీమ్ ఫేస్ 2 కింద 16 జాతీయ రహదారులు, 9 ఎక్స్‌ప్రెస్‌వేలపై 1576 ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్‌లను మంజూరు చేసింది కేంద్ర మంత్రిత్వశాఖ. జాతీయ రహదారుల వెంట ఇరు వైపులా ప్రతి 25 కిలోమీటర్ల దూరంలో ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు కానుంది. అలాగే హేవీ డ్యూటీ వెహికిల్స్ కోసం జాతీయ రహదారులపై ప్రతి 100 కి.మీలకు ఇరు ఒక ఛార్జింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తోంది. వీటిలో 266 ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్లను ఏపీలోని రహదారులపై, తెలంగాణలో 138 స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నట్టు భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ గతంలోనే ప్రకటించింది. ఇందులో భాగంగా 25 రాష్ట్రాల్లో, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 68 నగరాలలో 2,877 ఛార్జింగ్ స్టేషన్‌లు మంజూరు చేసింది. ఇవి పక్కాగా అమలు చేస్తే ఇంధనల ధరలపై పెట్టుబడులు పెట్టాల్సిన ఆగత్యం ఉండదు. అలాగే ధరల భయం కూడా ఉండదు.

# అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకుంటాం



అమరావతి,అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకుంటామని, ఆందోళన చెందవద్దని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ప్రతి రైతును కూటమి ప్రభుత్వం ఆదుకుంటు-దన్న ఆయన.. నష్టం జరిగిన ప్రాంతాల్లో అధికారులు వివరాలు సేకరిస్తున్నారని తెలిపారు.. గతంలో అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు.. వైఎస్ జగన్ రైతులను ఆదుకోవడం మర్చిపోయి.. విలాసాలు కోసం వేల కోట్లు- ఖర్చు చేశారన్నారు. కానీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే హెక్టార్‌కు ఇన్‌పుట్ సబ్సిడీని రూ.25 వేల నుంచి రూ.35 వేలకు అందించిన విషయం జగన్ రెడ్డికి కనిపించలేదా అని ప్రశ్నించారు.అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్నివిధాలా చర్యలు తీసుకుంటుందన్నారు అచ్చెన్నాయుడు.. అరటి, మొక్కజొన్న, బొప్పాయి, వరి పంటలకు కొన్నిచోట్ల అకాల వర్షాలతో పంట నష్టం జరిగిందని వివరించారు.. గత అయిదేళ్లలో అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఒక్క ఏడాది కూడా ఆదుకోలేదన్నారు.. నాటి వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులు అకాల వర్షాలతో నష్టపోయి రోడ్డున పడ్డా పరిహారం అందించకుండా జగన్ రెడ్డి విలాసాల కోసం వేలకోట్లు- వృథా చేశారని ఆరోపించారు.. గతంలో ఎన్నడూ లేని విధంగా పరిహారం అందించి రైతులకు అండగా నిలబడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటు-ందని స్పష్టం చేశారు.. ఇప్పటికే అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అకాల వర్షాలతో జరిగిన పంట నష్టం వివరాలను సేకరిస్తున్నారు. అరటి రైతులకు హెక్టారుకు రూ.35,000 మేర ఇన్ పుట్ సబ్సిడీ అందచేస్తాం.. మొక్కలు తిరిగి వేసుకునేందుకు అదనంగా హెక్టారుకు రూ.75 వేలు అందజేయడం జరుగుతుంది. మొత్తం రూ.1,10,000 వరకు సాయం అందుతుందన్నారు.. ఇన్సూరెన్స్ ఉంటే వారికి అదనంగా చెల్లింపులు ఉంటాయని వెల్లడించారు.. అనంతపురం, సత్యసాయి, కడప, ప్రకాశం జిల్లాల్లో ఇప్పటికే అధికారులు పర్యటించి వివరాలు సేకరిస్తున్నారు. మిగిలిన ప్రాంతాల్లో కూడా త్వరలో ఎన్యూమరేషన్ పక్రియ మొదలవుతుంది. రైతులు ఎవరూ అధైర్యపడవద్దు, ఆందోళన చెందవద్దు అని ధైర్యం చెప్పారు మంత్రి అచ్చెన్నాయుడు..

# తనిఖీలలో తేడా వస్తే తిరుగుటపానే ... ఇండియన్స్ కు కొత్త చిక్కులు

వాషింగ్టన్ : అమెరికాలో స్థిరపడిన భారతీయులు కొత్త చిక్కులు ఎదుర్కొంటున్నారు. గ్రీన్ కార్డ్ ఉన్నప్పటికీ విమానాశ్రయాల్లో అదనపు తనిఖీలు తప్పడం లేదని, సెక్యూరిటీ చెకప్ పేరుతో గంటల తరబడి అధికారులు ప్రశ్నిస్తున్నారని వాపోతున్నారు. డొనాల్డ్ ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక ఇమిగ్రేషన్ చట్టాలను మరింత కఠినం చేశారని చెబుతున్నారు. అమెరికాలో అక్రమంగా ఉంటున్న వారిని గుర్తించి వెనక్కి పంపించే క్రమంలో ఇమిగ్రేషన్ అధికారులు తనిఖీలను ముమ్మరం చేశారు. గ్రీన్ కార్డ్ పొందినంత మాత్రానా అమెరికాలో శాశ్వతంగా ఉండొచ్చని అనుకోవడం పొరపాటేనని, అమెరికాలో ఎవరు ఉండాలనేది నిర్ణయించేది తామేనని ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చేసిన ప్రకటనతో అమెరికాలో ఉంటున్న భారత సంతతి ప్రజల్లో గుబులు రేగుతోంది.అందుకు తగ్గట్లే విదేశాలకు ప్రయాణం పెట్టుకుంటే ఇమిగ్రేషన్ అధికారులు గంటల తరబడి తనిఖీలు చేస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా విదేశాల్లో ఆరు నెలలకు పైగా ఉండి తిరిగి అమెరికాలో అడుగుపెట్టిన వారిని మరింత ఎక్కువ సమయం ప్రశ్నిస్తున్నారని వివరించారు. తనిఖీలలో తేడా కనిపిస్తే వెంటనే భారత్ కు పంపివేస్తున్నారు..

గ్రీన్ కార్డు హోల్డర్లకు గుబులు

ఈ నేపథ్యంలో అమెరికాలో ఉంటున్న భారత సంతతి గ్రీన్ కార్డ్ హోల్డర్లు, హెచ్ 1 బి వీసాదారులు, ఎఫ్ 1 వీసాపై వెళ్లిన విద్యార్థులు మరింత అప్రమత్తంగా ఉండాలని ఇమిగ్రేషన్ వ్యవహారాలు చూసే న్యాయవాదులు సూచిస్తున్నారు. అమెరికాలో నివసించేందుకు ప్రభుత్వం జారీచేసిన అధికారిక గుర్తింపు పత్రాలను



వెంట తీసుకెళ్లాలని, గ్రీన్ కార్డ్ గడువు ముగిసేంత వరకూ చూడకుండా ముందుగానే రెన్యూవల్ చేయించుకోవాలని చెప్పారు. భారతదేశం జారీచేసిన పాస్ పోర్ట్, హెచ్ 1 బి వీసాదారులైతే తాజా పే స్లిప్, విద్యార్థులైతే తమ కోర్సు కొనసాగే కాలానికి సంబంధించి కాలేజ్ లేదా యూనివర్సిటీ జారీ చేసిన అధికారిక ధ్రువపత్రం వెంట ఉంచుకోవాలని తెలిపారు. అదేసమయంలో అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ అధికారులు కూడా భారత సంతతి అమెరికన్లకు, హెచ్ 1 బి, ఎఫ్ 1 వీసాదారులకు అడ్వైజరీ జారీ చేశారు. చట్టాల్లో మార్పుల కారణంగా అదనపు తనిఖీలు తప్పవని, గంటల తరబడి తనిఖీలు కొనసాగినా ఓర్పు వహించాలని సూచించారు. అన్ని డాక్యుమెంట్స్ సక్రమంగా ఉంటే రెడ్ కార్పెట్ తో స్వాగతం పలుకుతామని, ఫేక్ డాక్యుమెంట్స్ గా గుర్తిస్తే చట్ట ప్రకారం కఠినంగా వ్యవహరిస్తామని అక్కడి అధికారులు చెబుతున్నారు.

# ఉగాది జాతర...నల్లమలలో భక్తజన ప్రవాహం



నంద్యాల : భానుడు భగభగ మండుతున్నాడు. దప్పికతో గొంతు ఎండిపోతోంది. రాత్రి లేదు.. పగలు లేదు. అడవిలో కాలినడకతో అష్టకష్టాలతో పని లేదు. కానీ తమ పుట్టినింటి ఆడబిడ్డను దర్శించుకోవాలి. ఆమె నుదుటిన మిరియాల బొట్టు దిద్దాలి. గాజులు తొడిగి చీరెసారెలు సమర్పించాలి. అప్పుడు కలిగే దివ్యానుభూతి వర్ణనాతీతం. ఇదీ శ్రీశైలంపై వేంచేసిన శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయంలో కన్నడ భక్తుల అనుభూతి. ఉగాది పర్వదినం సందర్భంగా నంద్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవస్థానంలో ఈనెల 27నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు శ్రీశైలం దివ్యక్షేత్రానికి తరలి వస్తున్నారు. మరీ ముఖ్యంగా నల్లమల అడవి మార్గంలో కాలినడకన భక్త జనజాతర కనువిందు చేస్తోంది.

ఆడపడుచుకు సారె సమర్పణకు

%అపర శబరిమలైగా పేరొందిన శ్రీశైలం పుణ్యక్షేత్రంలో తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ రోజున .. శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామిని ప్రత్యేకంగా దర్శించుకునేందుకు కన్నడ భక్తులు తండోపతండాలుగా తరలిరావటం విశేషం. వీరందరూ కాలినడక మొక్కుతో శ్రీశైలం చేరుతారు. ఇందుకు ఓ ప్రత్యేకత ఉంది. పురాణ శాస్త్రం ప్రకారం, శ్రీ భ్రమరాంబిక దేవీ కన్నడిగుల ఆడపడుచు. తమ ఇంట్లో అఖండ దీపం వెలిగించి.. పిల్లాజెల్లా.. చిన్నా పెద్ద, ఆడమగ ఇలా ఇంటిల్లిపాది నెలరోజుల పాటు కాలినడకన శ్రీశైలం చేరుకుంటారు. అడవి మార్గంలో మల్లన్న, భ్రమరాంబికను తలచుకుంటూ ఆలయానికి చేరుతారు. ఇక్కడ శ్రీ భ్రమరాంబికను దర్శించుకుని.. తొలుత మిరియాల బొట్టు పెడతారు. దీంతో భ్రమరాంబికకు అంటిన మరక పోతుందని కన్నడిగుల నమ్మకం. ఇక గాజులు, చీరె సారెలు సమర్పిస్తారు. ఇలా ఆది దంపతుల దర్శనం అనంతరం తిరిగి తమ ఇళ్లకు చేరుతారు. ఇలా తమ పుట్టినింటి ఆడపడుచుకు చీరెసారెలు సమర్పించటం కన్నడిగుల ఆచారం, సంప్రదాయం. ఈ ప్రత్యేక పూజలే ఆనవాయితీగా భావిస్తారు. ఇక ఇంట్లో అఖండ దీపం వెలుగుతూనే ఉంటే.. తమ కష్టాలు తీరినట్టేనని సంబరం చేసుకొంటారు.

కన్నడిగుల జాతర..

%తమ పుట్టింటి ఆడపడుచు శ్రీ భ్రమరాంబిక దేవీకి తమ ఊరి నుంచి పసుపు కుంకుమ, గాజులు, చీరెసారెలు సమర్పించటానికి కన్నడిగులు బయలుదేరారు. కర్ణాటక రాష్ట్రం నుంచి వీరు కాలినడకన వివిధ ప్రాంతాల్లో గుంపులు గుంపులుగా కలిసి.. కర్నూలు, నందికొట్కూరు, ఆత్మకూరు పట్టణాల మీదుగా వెంకటాపురం వరకు కాలినడకన చేరారు. మధ్య మధ్యలో వీరికి ఉచితంగా భోజనాలు, దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ, తాగునీరు తదితర సదుపాయాలను దాతలు కల్పించారు. మధ్య మధ్యలో వైద్య శిబిరాలను కూడా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది.వెంకటాపురం నుంచి నల్లమల అటవీ ప్రాంతంలో దాదాపుగా 45 కిలోమీటర్లు వేసవిని సైతం లెక్కచేయకుండా మండుటెండల్లో పుట్టింటి ఆడపడుచు భ్రమరాంబికా దేవి మల్లికార్జున స్వామి నామస్మరణలతో ముందుకు సాగిపోతున్నారు. నల్లమల్ల అటవీ ప్రాంతంలో రాత్రి పగలు తేడా లేకుండా పాదయాత్ర చేయటం కన్నడ భక్తుల ప్రత్యేకత. కన్నడిగులు భక్తి పారవశ్యంతో ఊత కర్రల సాయంతో పాదయాత్ర చేస్తున్నారు. అలుపు సొలుపు లేకుండా నడవటం తమకు భ్రమరాంబిక ఇచ్చిన వరంగా భావిస్తామని కన్నడికులు పేర్కొన టం విశేషం. ప్రస్తుతం శ్రీశైలం దేవస్థానం కన్నడిగుల తో కళకళలాడుతోంది. ఇక్కడకు చేరిన భక్తులకు దేవస్థానం అధికారులు ప్రత్యే వసతి సౌకర్యాలు కల్పిస్తున్నారు.

## శ్రవణ్ రావుకు సుప్రీంలో ఊరట...

న్యూఢిల్లీ,ఫోన్ ట్యాపింగ్ కేసులో శ్రవణ్ రావుకు ఊరట లభించింది. విదేశాల నుంచి భారత్ వచ్చేందుకు ఆయనను అరెస్ట్ చేయకుండా సుప్రీం కోర్టు మధ్యంతర రక్షణ కల్పిస్తూ ఆదేశాలు జారీ చేసింది. సుప్రీం నుంచి ఊరట లభించడంతో ఈవారం చివర్లో శ్రవణ్ రావు హైదరాబాద్ రానున్నారు. అయితే పోలీసుల విచారణకు హాజరుకావాలని, విచారణకు సహకరించాలని కోర్టు ఆదేశించింది. శ్రవణ్ రావు 48 గంటల్లో శ్రవణ్ రావు ఇండియాకు వస్తారని సీనియర్ న్యాయవాది దామ శేషాద్రి నాయుడు కోర్టుకు తెలిపారు. తెలంగాణ ఫోన్ ట్యాపింగ్‌పై సోమవారం సుప్రీంలో విచారణకు రాగా, శ్రవణ్ రావు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిగింది. ఈ క్రమంలో శ్రవణ్‌కు సుప్రీం స్వల్ప ఊరట కల్పిస్తూ.. శ్రవణ్‌పై కఠిన చర్యలు తీసుకోవద్దంటూ ఆదేశాలు ఇచ్చింది. అలాగే పోలీసుల విచారణకు సహకరించాలని శ్రవణ్‌కు సుప్రీం ఆదేశించారు. కచ్చితంగా విచారణకు హాజరుకావాల్సిందే అని స్పష్టం చేసింది. విచారణ నిమిత్తం అమెరికా నుంచి భారత్‌కు వచ్చేందుకు శ్రవణ్‌ను అరెస్ట్ చేయకుండా సుప్రీం మధ్యంతర రక్షణ కల్పించింది.

# ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి ఎన్‌కౌంటర్..



ఛత్తీస్‌గఢ్ :ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం గత కొన్ని రోజులుగా తుపాకుల మోతతో దద్దరిల్లుతోంది. గత వారం జరిగిన రెండు వేర్వేరు ఎదురు కాల్పుల్లో 30 మంది మావోయిస్టులు హతమైన విషయం తెలిసిందే. తాజాగా అక్కడ మరోసారి ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. దంతెవాడ జిల్లాలో భద్రతాదళాల కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు.దంతెవాడ - బీజాపూర్ జిల్లాల సరిహద్దులోని అటవీ ప్రాంతంలో భద్రతా సిబ్బంది నక్సలైట్ వ్యతిరేక ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తుండగా ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందినట్లు పోలీసు అధికారులు తెలిపారు. ఘటనాస్థలి నుంచి నక్సలైట్ల మృతదేహాలతోపాటు తుపాకీలు, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఆపరేషన్ కొనసాగుతున్నట్లు వెల్లడించారు.కాగా, ఈనెల 20వ తేదీన తుపాకుల మోతతో దండకారణ్యం రక్తసిక్తమైన విషయం తెలిసిందే. మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య గురువారం జరిగిన రెండు వేర్వేరు ఎదురుకాల్పుల్లో 30 మంది మావోయిస్టులు, ఒక జవాన్ మృతి చెందారు. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, కాంకేర్ జిల్లాల్లో ఈ ఘటనలు చోటు చేసుకున్నాయి. బీజాపూర్ జిల్లా పీడియా అడవుల్లో గురువారం ఉదయం నక్సల్స్, పోలీస్ వర్గాల మధ్య సుమారు నాలుగు గంటలపాటు భీకర పోరు సాగింది. ఘటనా స్థలం నుంచి 26 మంది మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. కాంకేర్-నారాయణ్‌పూర్ జిల్లాల సరిహద్దు కోరోస్‌కోడో గ్రామ సమీప అడవుల్లో జరిగిన మరో ఎదురుకాల్పుల్లో నలుగురు మావోలు మృతి చెందారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com